ఆదివారం
07-08-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 47
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఉపరాష్ట్రపతిగా ధన్కర్ విజయం

- 346 ఓట్ల తేడాతో గెలుపు
- మార్గరెట్ ఆల్వాకు 182 ఓట్లు
- 11న ప్రమాణ స్వీకారం



న్యూఢిల్లీ: భారత 14వ ఉప రాష్ట్రపతిగా జగదీప్ ధన్కర్ ఎన్నికయ్యారు. 346 ఓట్ల తేడాతో ప్రత్యర్థి, ప్రతిపక్షాల అభ్యర్థి మార్గరెట్ ఆల్వాపై విజయం సాధించారు. ధన్కర్‌కు 528 ఓట్లు పోల్‌కాగా, ఆల్వాకు 182 ఓట్లు వచ్చాయి. మొత్తం 725 ఓట్లు పోల్‌కాగా అందులో 15 చెల్లలేదు. 1997 నుంచి ఏ ఉపరాష్ట్రపతికి ఇంత భారీ మెజారిటీ రాలేదు. ఈ మేరకు లోక్‌సభ ప్రధాన

- మిగతా 2 లో

జడ్జీలకూ నార్కో పరీక్షలు

- ప్రొటోకాల్ గర్వం వీడాలి
- కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.కృష్ణ భట్

బెంగళూరు: న్యాయమూర్తులు, లోకాయుక్తలు, ఇతర ఉన్నతాధికారులు తమపై తప్పుడు, ప్రేరేపిత ఆరోపణలు వస్తే నార్కో అనాలిసిస్ పరీక్షలు చేయించుకోవాలని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.కృష్ణ భట్ స్పష్టంచేశారు. ఆయన ఈ వారం పదవీ విరమణ చేశారు. హైకోర్టులో ఆయనకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో జస్టిస్ భట్ మాట్లాడారు. 'ఇది అసంబద్ధంగా, తీవ్రంగా అనిపించవచ్చు. న్యాయమూర్తులు, న్యాయాధికారులు, లోకాయుక్త, ఉప లోకాయుక్త వంటి ఇతర ఉన్నతాధికారులు నార్కో విశ్లేషణ పరీక్ష కోసం తమకు తాము

- మిగతా 2 లో

అదరగొట్టిన అమ్మాయిలు

8 లో

కామన్వెల్త్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లిన టీమిండియా

కామన్వెల్త్‌లో తొలిసారి జరుగుతున్న మహిళల క్రికెట్‌లో టీమిండియా ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీస్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 164 పరుగులు చేసింది. అనంతరం ఇంగ్లండ్‌ను 160 పరుగులకే పరిమితం చేసింది. నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్‌లో అడుగు పెట్టి పతకం ఖాయం చేసుకుంది. రెండో సెమీస్‌లో గెలిచిన జట్టుతో భారత్ ఫైనల్‌లో తలపడనుంది.

వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదా ?

- రాజధానుల ఏర్పాటుపై అధికారం లేదని ఇప్పుడు తెల్సిందా ?
- విజయసాయిరెడ్డి బిల్లుపై సీపీఐ రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాజధానుల ఏర్పాటు విషయంలో రాష్ట్రానికి అధికారం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నేత విజయసాయి రెడ్డి ఇప్పటికి గుర్తించారా? లేక మూడేళ్లు నిద్రపోయారా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. మూడు రాజధానులపై అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం, దీనిని బీజేపీతో సహా ఏపీలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకించడం, చివరకు హైకోర్టు సైతం మూడు రాజధానుల బిల్లు చెల్లదని స్పష్టంగా చెప్పినప్పటికీ మూడేళ్ల తర్వాత విజయసాయి రెడ్డి ఇంకా రాజ్యసభలో రాజధానులపై నిర్ణయాధికారం రాష్ట్రాలకే కావాలంటూ ప్రైవేటు బిల్లు పెట్టడం వైసీపీ నేతల

- మిగతా 2 లో

గోరంట్లపై చర్యలేవి?

- దేశం ఉలిక్కిపడినా స్పందించని సీఎం
- నాలుగు రోజులైనా పురోగతి లేని విచారణ
- అంబటి, అవంతి సరసన చేరతారా... పృథ్వీ బాట పడతారా?
- అధిష్టాన నిర్ణయంపై వైసీపీ శ్రేణుల్లో ఉత్కంఠ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ నగ్న వీడియో ఘటన వెలుగు చూసి నాలుగు రోజులైనా వైసీపీ అధిష్టానంలో ఎలాంటి స్పందనా లేదు. జుగుప్సాకరమైన ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు, యావత్ దేశం ఉలిక్కిపడింది. ట్విట్టర్‌లో టాప్-3లో ఉండడం గమనార్హం. దీనిపై మహిళాలోకం మండిపడింది. ఇటువంటి ప్రజా ప్రతినిధిని తక్షణమే బర్తరఫ్ చేయాలని ఆందోళనలు చేశారు. మూడు రోజులుగా నిరసన కార్యక్రమాలు సాగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ వైసీపీ అధిష్టానంలో ఏమాత్రం స్పందన కానరావడం లేదు. ప్రస్తుతం పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పార్టీలకు చెందిన ఎంపీలకు ఈ వీడియో చేరింది. దీనిపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీవ్రంగా స్పందిస్తారని వైసీపీ నేతలంతా భావించారు. కానీ ఆయన దీనిపై ఇంతవరకు నోరు విప్పలేదు. గతంలో తిరుపతి ఎస్వీబీసీ చైర్మన్ పృథ్వీరాజ్‌ను సస్పెండ్ చేసిన విధంగానే గోరంట్ల మాధవ్‌పై కూడా వేటు పడుతుందని ఊహించారు. కాని మూడు రోజులుగా ఆ పార్టీ అధిష్టానం చర్చోపచర్చలు

- మిగతా 2 లో

మోదీ, బాబు మాటామంతీ

ఆజాదీకా అమృత మహోత్సవ్‌కు జగన్, కేసీఆర్ డుమ్మా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సుదీర్ఘకాలం తర్వాత ఒకే వేదికపై ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు ఆశీనులయ్యారు. కేంద్రప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత మహోత్సవ్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంట్రల్‌లో శనివారం దేశంలోని అన్ని పార్టీల నేతలతో ఉత్సవ్ కమిటీ ఏర్పాటు చేసిన భేటీకి సీఎం జగన్‌తో పాటు మాజీ సీఎం చంద్రబాబుని ఆహ్వానించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గైర్హాజరు కాగా, చంద్రబాబు హాజరయ్యారు. 2019 ఎన్నికలకు ఏడాది ముందుగా బీజేపీతో విభేదించిన చంద్రబాబు మరలా నాలుగేళ్ల తర్వాత మోదీ అధ్యక్షతన జరిగే సమావేశానికి హాజరు కావడం ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా చంద్రబాబు మోదీతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులతోనూ ముచ్చటించారు. విశేషమేమిటంటే అమృత మహోత్సవ్

- మిగతా 2 లో

నేడు నింగిలోకి ఎస్ఎస్ఎల్‌వీ

చారిత్రక ప్రయోగానికి ఇస్రో సిద్ధం: ఐదు గంటల కౌంట్‌డౌన్

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చరిత్ర సృష్టించబోతోంది. తన మొదటి చిన్న ఉపగ్రహాల ప్రయోగ వాహనం 'ఎస్ఎస్ఎల్‌వీ మిషన్'కు సర్వం సిద్ధం చేసింది.

2 లో

వణికిస్తున్న కరోనా

- 10 శాతం పాజిటివిటీ రేటు
- రాష్ట్రాలకు కేంద్రం లేఖలు

2 లో

దేశంలో కరోనా మహమ్మారి వ్యాప్తి అదుపులోనే ఉన్నప్పటికీ.. కొన్ని రాష్ట్రాల్లో ఇటీవల కేసులు పెరుగుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది.

అమెరికాతో చర్చలు బంద్: చైనా

బీజింగ్: అమెరికా ప్రతినిధుల స్పీకర్ నాన్సీ పెలోసి తైవాన్ పర్యటనపై చైనా ప్రతిచర్యలకు పూనుకుంది. ఎనిమిది వేర్వేరు రంగాలకు సంబంధించి అమెరికాతో చర్చలు, సహకారాన్ని రద్దు చేస్తున్నట్లు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. వాతావరణ మార్పులు, సైనిక సంబంధాలు, అక్రమ వలసదారులరు, నేరవిషయాలలో న్యాయ సహాయంపై సహకారం, అంతర్జాతీయ నేరాలకు వ్యతిరేకంగా సహకారం, మాదకద్రవ్యాల నిరోధక ప్రయత్నాలు, ఆర్థిక, వాణిజ్య రంగాలపై చర్చలను నిషేధించింది. చైనాను సందర్శించడం లేదా చైనాలో నివసించే అమెరికన్ పౌరులపై ప్రయాణ నిషేధాలు విధించడం, రాజకీయ కారణాలతో ఇతరులను అదుపులోకి తీసుకున్నట్లు చైనా ఆరోపించింది. ఇప్పుడు ఈ కేసులను చర్చించడానికి చైనా నిరాకరించింది. విశ్వాసాన్ని పెంపుకు, సంక్షోభ నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు జరగవలసిన చర్చలను చైనా రద్దుచేసింది. చైనా సైనిక విన్యాసాలు తైవాన్‌లో దశాబ్దాలుగా ఉన్న దానికంటే మరింత తీవ్రతరం అయ్యే ప్రమాదం ంది. రెండు భద్రతా సమావేశాలను, సైనిక నాయకుల మధ్య చర్చలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

బాంబు దాడికి మేమే బాధ్యులం : ఐసిస్

కాబూల్ : అఫ్గాన్‌లో శుక్రవారం జరిగిన బాంబు దాడికి తామే బాధ్యులమని ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ప్రకటించింది. పశ్చిమ కాబూల్‌లోని షియా నివాస ప్రాంతంలో జరిగిన పేలుడు ఘటనలో ఎనిమిదిమంది మరణించగా 18 మంది గాయపడ్డారు. రద్దీగా ఉండే ప్రదేశాన్ని లక్ష్యంగా చేసుకుని పేలుళ్లు సంభవించాయని పోలీసు అధికార ప్రతినిధి ఖలీద్ జద్రాన్ తెలిపారు. కూరగాయల బండిలో పేలుడు పదార్థాలను ఉంచినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. క్షతగాత్రులలో చాలా మందికి తీవ్రమైన గాయాలైనందున మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అఫ్గాన్‌లో షియాలు చాలా ఏళ్లుగా హింసను ఎదుర్కొంటున్నారు. మొహర్రం తొలి 10 రోజుల జ్ఞాపకార్థం అనేక మంది షియాలు గుమిగూడారని, ఈ నేపథ్యంలో అక్కడ బాంబు పేలినట్లు ఓ అధికారి తెలిపారు. అఫ్గాన్‌లోని తాలిబాన్ పాలనలో షియా మసీదుల్లో ఈద్ ప్రార్థనలను నిర్వహించకుండా నిషేధించింది.

పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు

10 మంది మృతి

గాజా సిటీ: ఇజ్రాయిల్-పలస్తీనాల మధ్య ఘర్షణలు మరింత తీవ్రరూపం దాల్చాయి. శుక్రవారం ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు హమాస్ ఆధీనంలోని గాజాపై విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో 10మంది మృతి చెందారు. గాజా అంతటా జరిగిన వరుస క్షిపణి దాడుల్లో 55మంది గాయపడ్డారు. గాజా సిటీలోని అపార్టుమెంటు లక్ష్యంగా జరిగిన దాడుల్లో ఇస్లామిక్ జిహాదీ కమాండర్ మృతిచెందారు. పదిమంది మృతుల్లో ఐదేళ్ల చిన్నారి కూడా ఉంది.ఆమె తలపై బలమైన గాయాలైనట్లు తెలుస్తోంది. నర్సరీలో చేరేందుకు బ్యాగు, పుస్తకాలు కొనుగోలకు షాపింగ్ చేయడానికి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా ఐదేళ్ల బాలిక అలా ఖద్దూమ్ తన తండ్రితో కలిసి క్షిపణి దాడిలో మరణించింది. ఆమె తల్లి రాషా చాలా షాక్‌లో ఉంది. అమాయక ఐదేళ్ల బాలికను ఈ విధంగా చంపడం ఏమిటి అని కుటుంబ సభ్యుడు మహ్మద్ అబు జబల్ అల్ జజీరాను ప్రశ్నించారు. సివిల్ డిఫెన్స్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే గాజా స్ట్రిప్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తతలను నిలువరించేందుకు ఇజ్రాయిల్ -పలస్తీనా వర్గాల మధ్య ఈజిప్టు మధ్యవర్తిత్వం చేస్తున్నట్లు ఈజిప్టు అధికారి స్థానిక టీవీ ఛానెల్ వెల్లడించింది.

జడ్జీలకూ నార్కో పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

ముందుకు రావాలి' అని న్యాయమూర్తి అన్నారు. న్యాయమూర్తులపై ఆరోపణలు వచ్చినప్పుడు, ఫిర్యాదు ప్రేరేపితమని, తప్పుడుదని భావించినట్లయితే అటువంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. న్యాయమూర్తులు తమ పరిశీలన, పదోన్నతుల సమయంలో వారు చెప్పినట్లు తీర్పులను అందజేస్తారని కొన్నిసార్లు వినిపించే ఫిర్యాదులకు జస్టిస్ భట్ దీనిని ఒక పరిష్కారంగా పేర్కొన్నారు. 'ఇటువంటి పరిస్థితులు ముఖ్యంగా కార్యనిర్వాహక, సంస్థ విశ్వసనీయతకు లెక్కించలేని నష్టాన్ని కలిగించాయి' అని పేర్కొన్నారు. జస్టిస్ భట్ తన ప్రసంగంలో న్యాయవ్యవస్థ స్వతంత్రత అంశాన్ని కూడా ప్రస్తావించారు. ప్రోటోకాల్‌ను అతిగా పాటించడం న్యాయమూర్తులు వదులుకోవలసిన గర్వమని ఆయన అన్నారు. జిల్లా జడ్జి విమానాశ్రయంలో తనను వ్యక్తిగతంగా స్వాగతించనందున అతనిపై చర్య తీసుకోవాలని ఒక హైకోర్టు న్యాయమూర్తి అప్పటి ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడాన్ని ఆయన ఉదహరించారు. 'అటువంటి న్యాయమూర్తులు తమను తాము ఎటువంటి ప్రభుత్వ పదవులు చేపట్టడానికి అనర్హులుగా మార్చుకుంటారు. ఇటువంటి గర్వాలు న్యాయవ్యవస్థ స్వతంత్రతను విధ్వంసం చేస్తాయి' జస్టిస్ భట్ అన్నారు. 1989 నుంచి మంగళూరులోని వివిధ కోర్టులలో, బార్‌లో పని చేసిన తరువాత, జస్టిస్ భట్ 1998లో కర్ణాటక హైకోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత గురించి తరచుగా ఉదహరించే ప్రశ్నను ప్రస్తావించారు. 'నా అభిప్రాయం ప్రకారం, న్యాయవ్యవస్థ స్వతంత్రతకు ముప్పు అనేది ఒక అపోహ. న్యాయమూర్తి స్వతంత్రంగా ఉండటం ద్వారా న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యం గ్రహించబడుతుంది' అని ఆయన అన్నారు. ఇది న్యాయమూర్తి కొన్ని విలువలు, ధర్మాలను అంతర్గతీకరించడం ద్వారా మాత్రమే సాధ్యపడుతుందని తెలిపారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తుల కుమారులు, కుమార్తెలు న్యాయ అధికారులను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నారని కూడా జస్టిస్ భట్ విమర్శించారు.

వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదా ?

(మొదటిపేజీ తరువాయి)

మూర్ఖత్వానికి పరాకాష్టగా పేర్కొన్నారు. చట్టం పై వైసీపీ నేతలకు అసలు ఏమాత్రం అవగాహన లేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. అసలు వైసీపీ ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయమే అతి పెద్ద మోసపు విధానమన్నారు. అమరావతి రాజధానికి అసెంబ్లీ సాక్షిగా నాటి ప్రతిపక్ష నేత జగన్‌మోహన్ రెడ్డి ఆమోదం తెలిపారు. అలాగే అన్ని రాజకీయ పార్టీలు ఆమోదం తెలపడం వల్లే రైతులు ఉచితంగా రాజధాని నిర్మాణానికి 34 వేల ఎకరాల భూములు అందజేశారు. తర్వాత వాటిల్లో అనేక భవనాల నిర్మాణాలు చేపట్టారు. రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతులు వంటి పనులకు దాదాపు రూ.10 వేల కోట్లు ఇప్పటికే ఖర్చు పెట్టారు. ఇంకా వేల కోట్ల పనులు జరుగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం కూడా గత మూడు సంవత్సరాలుగా ఇక్కడి నుంచే పాలన కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో హైకోర్టుతో సహా అందరూ వ్యతిరేకించిన మూడు రాజధానులపై విజయసాయిరెడ్డి మళ్లీ రాష్ట్రాలకే నిర్ణయాధికారం ఉండాలంటూ రాజ్యసభలో బిల్లు పెట్టడం తుగ్లక్ చర్యగా రామకృష్ణ అభివర్ణించారు. ఇప్పటికైనా విజ్ఞత పాటించి ప్రజలంతా మూకుమ్మడిగా తిరస్కరించిన మూడు రాజధానుల నిర్ణయాన్ని పక్కనబెట్టి, అమరావతి రాజధాని అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని హితవు పలికారు.

ఉపరాష్ట్రపతిగా ధన్కర్ విజయం

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి ఉత్పాల్ కె.సింగ్ ప్రకటించారు. మొత్తం 780 మంది ఎంపీలకుగాను 725 మంది ఓటు వేయగా 92.94శాతం పోలింగ్ నమోదు అయింది. 39 మంది ఎంపీలు ఉన్న తృణమూల్ కాంగ్రెస్ ఓటింగ్‌ను బహిష్కరించింది. దాదాపు 50 మందికిపైగా ఉభయసభల సభ్యులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. మార్గరెట్ ఆల్వాకు టీఆర్ఎస్, ఆప్, శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గం మద్దతిచ్చాయి. అధికార బీజేపీకి లోక్‌సభలో 303, రాజ్యసభలో 91 కలిపి 394 ఓట్లు ఉన్నాయి. గెలుపునకు అవసరమైన 373 ఓట్లు బీజేపీ దగ్గరే ఉన్నాయి. ఇక జేడీ(యూ), బీఎస్పీ, బీజేడీ, అన్నాడీఎంకే, వైఎస్ఆర్‌సీపీ, టీడీపీ, శిరోమణి అకాలీదళ్, ఎల్జేపీ, ఏజీపీ, ఎన్‌పీపీ, ఎన్‌పీఎఫ్, ఎంఎన్ఎఫ్, ఎస్‌కేఎం, ఎన్‌డీపీపీ, ఆర్‌పీఐ-ఎ, పీఎంకే, అప్నాదళ్, ఏజేఎస్‌యు, టీఎంసీ-ఎం పార్టీలు మద్దతివ్వడంతో ధన్కర్ ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. ప్రస్తుత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పదవీ కాలం ఈనెల 10వ తేదీతో ముగియనుంది. నూతన ఉపరాష్ట్రపతిగా ధన్కర్ 11న ప్రమాణస్వీకారం చేస్తారు. 12వ తేదీ వరకు పార్లమెంటు జరుగుతున్నందున చివరిరోజున చైర్మన్‌గా సభను కొత్త ఉపరాష్ట్రపతి నిర్వహించేందుకు అవకాశం ఉంటుంది. కాగా, ధన్కర్‌కు ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, అనేకమంది నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

రైతు కుటుంబం నుంచి ఉపరాష్ట్రపతి వరకు...

జగదీప్ ధన్కర్ (71) స్వస్థలం రాజస్థాన్‌లోని కితానా గ్రామం. 1951 మే 18న గోకుల్‌చంద్, కేసరిదేవీలకు ఆయన జన్మించారు. ప్రాథమిక విద్యను కితానా గ్రామంలో, హైస్కూలు విద్యను చితోర్‌ఘర్ సైనిక స్కూల్లో పూర్తి చేశారు. రాజస్థాన్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేశారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఆయన రాజకీయాలతో పాటు న్యాయవాదిగా, క్రీడాకారుడిగా రాణించారు. సుప్రీంకోర్టు న్యాయవాదిగా సట్లజ్ జలాల వివాదంలో హరియాణా ప్రభుత్వం తరఫున వాదించి పేరుగాంచారు. రాజస్థాన్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగానూ పనిచేశారు. రాజస్థాన్‌లోని కిషన్‌గంజ్ నుంచి 1993-98 మధ్య ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 1990లో కేంద్రమంత్రి అయ్యారు. లోక్‌సభతో పాటు రాజస్థాన్ అసెంబ్లీలో వివిధ కమిటీల్లో పనిచేశారు. రాజస్థాన్ ఒలింపిక్ అసోసియేషన్, టెన్నిస్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2019 జులై 20న బెంగాల్ గవర్నర్ అయ్యారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో వివాదంతో అందరి దృష్టిని ఆకర్షించారు.

ఆల్వా శుభాకాంక్షలు: నూతన ఉపరాష్ట్రపతిగా ఎన్నికైనందుకుగాను జగదీప్ ధన్కర్‌కు మార్గరెట్ ఆల్వా శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిపక్షాల నాయకులకు, తనకు ఓటు వేసిన ఎంపీలు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ, 'ఈ ఎన్నికలు ముగిశాయిగానీ రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్యం బలోపేతం, పార్లమెంటు హూందాతనాన్ని పునరుద్ధరించేందుకు పోరాటం కొనసాగుతుంది' అని నొక్కిచెప్పారు.

ఓటేసిన 725 ఎంపీలు...తృణమూల్ దూరం

ఉపరాష్ట్రపతి ఎన్నిక శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 93శాతం పోలింగ్ నమోదు అయింది. ఉభయ సభల్లో 780 మంది ఎంపీలు ఉండగా రాజ్యసభలో ఎనిమిది ఖాళీలు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్ 39 మంది ఎంపీలు ఎన్నికల్లో పాల్గొనలేదు. 725 మంది ఎంపీలు ఓటు వేశారు. ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు పీయూశ్ గోయల్, అనుప్రియా పటేల్, దర్శనా జార్దోశ్, సాధ్వీ నిరంజన్ జ్యోతి, విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, స్పీకర్ ఓం బిర్లా ఉదయాన్నే ఓటు వేశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, ఎంపీలు రాహుల్‌గాంధీ, శశిథరూర్, జైరాం రమేశ్, పి.చిదంబరం, మల్లికార్జున ఖర్గే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు వేసినవారిలో డీఎంకే ఎంపీ తిరుచీ శివ, శిరోమణి అకాలీ దళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, శాస్త్ర, సాంకేతిశాఖమంత్రి జితేంద్ర సింగ్, బీజేపీ చీఫ్ విప్ రాకేశ్ సింగ్, టీఆర్ఎస్, వైసీపీ ఎంపీలు ఉన్నారు.

వీల్ చెయిర్‌లో మన్మోహన్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఓటు హక్కును ఉదయాన్నే వినియోగించుకున్నారు. వీల్‌చైర్‌పై వచ్చిన ఆయనకు ఓటేసేందుకు సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్ సహకరించారు. తనను కలిసిన వారికి మన్మోహన్ సింగ్ చేతులు జోడించి అభివాదం చేశారు.

మానవతాసాయాన్ని అభ్యర్థిస్తున్న ఇథియోపియా

అడిస్‌అబాబా: ఇథియోపియాలో 20 మిలియన్ల మందికి పైగా మానవతా సహాయం అవసరమని అంచనా వేస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి మానవతా వ్యవహారాల సమన్వయ కార్యాలయం తెలిపింది. ఇథియోపియాలో నెలకొన్న తాజా పరిస్థితులపై విడుదల చేసిన తాజా నివేదికలో ఇథియోపియా కోసం మానవతా సహాయంకోసం దాదాపు మూడు వంతుల మంది మహిళలు, పిల్లలు ఉన్నారు. 2021లో ఇథియోపియాలో మానవతావాద పరిస్థితి గణనీయంగా క్షీణించిందని, దేశవ్యాప్తంగా మానవతా అవసరాలు పెరిగాయని పేర్కొంది. ఈ పరిస్థితి కొనసాగుతున్నందున, 2022లో 20 మిలియన్లకు పైగా ప్రజలకు మానవతా సహాయం, రక్షణ అవసరం అని పేర్కొంది. ఇథియోపియా ఉత్తర భాగంలో నెలకొన్న సంఘర్షణలు, హింస, వరదలు ముఖ్యంగా దేశంలోని దక్షిణ భాగంలో కొనసాగుతున్న కరువు వంటి సహజ విపత్తులు మానవతా అవసరాలకు ప్రధాన కారణంగాఉన్నాయి. తక్షణ సాయంగా సుమారు 3.09 బిలియన్ యుఎస్ డాలర్లు అవసరమని పేర్కొంది. ఇథియోపియన్ల జీవితాలపై ప్రభావం చూపుతున్న తీవ్ర కరవు, ప్రకృతి వైపరీత్యాల మధ్య మానవతా సహాయం అవసరమైన వారి సంఖ్య గత దశాబ్దంలో పెరిగిందని ఈ నివేదిక తెలిపింది. 2013-2015 మధ్య, మానవతా సాయం కోసం ఎదురుచూస్తున్న వారి సంఖ్య 2.7 మిలియన్ల నుండి 4 మిలియన్లకు పెరిగింది.

మాటలు ఘనం... చేతలు శూన్యం!

విశాలాంధ్ర - అరకులోయ: రాష్ట్రంలో 26 జిల్లాల పరిధిలోని మన్య ప్రాంతాల గిరిజనులు అమాయక జీవనం సాగిస్తూ, ప్రభుత్వ మాయమాటలు నమ్ముతూ, పాలకుల మెహర్బానానికి తలొగ్గుతూ బతుకుసాగిస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారానా... అధికారులు వస్తూపోతూ ఉన్నా వారి తలరాతలు మాత్రం మారడం లేదు. పాడేరు ఏజెన్సీ ప్రాంతానికి వస్తే.. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల ప్రగతి కోసం 1975లో ఐటీడీఏ ఏర్పాటు చేశారు. ఏళ్లు గడుస్తున్న ఐటీడీఏ పనితీరులో ఎటువంటి మార్పు లేదు. 75 ఏళ్ల పూర్తి చేసుకొని ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుపుకుంటున్న తరుణంలో ఏజెన్సీ ప్రాంతంలో ఎటువంటి ప్రగతి లేదు. ప్రతి ఏట ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవం, 15న జెండా పండగను జరుపుకుంటున్నాం. ఆదివాసి దినోత్సవాన్ని ప్రతి ఏట ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రభుత్వం చెప్పుకోవడమే తప్ప గిరిజన ప్రాంతాల అభివృద్ధి, వారి ప్రగతి ఎక్కడికి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని ప్రజాసంఘాలు, గిరిజన సంఘాల నేతలు, స్వచ్ఛంద సేవ సంస్థల సభ్యులు ఆవేదన చెందుతున్నారు. గిరిజనులకు అది చేశాం... ఇది చేశాం... వేలకోట్లు ఖర్చు చేశాం... గిరిజన అభివృద్ధిని ప్రగతి పథంలో నడిపించాం అంటూ పాలకులు, అధికారులు ప్రకటనలు గుప్పించడమే తప్ప వాస్తవానికి గిరిజన ప్రాంతాల్లో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయన్న సంగతి జగమెరిగిన సత్యం. ఇప్పటికీ అనేక మారుమూల గ్రామాలకు రహదారులు లేవు. వైద్య సేవలు అంతంత మాత్రమే. తాగునీటి లేదు. అనేక గ్రామాలు విద్యుత్ వెలుగులు లేక అంధకారంలో మగ్గుతున్నాయని, ఆదివాసి ప్రాంతాలలో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయని ప్రజా సంఘాల నాయకులు, గిరిజనులు మండిపడుతున్నారు. వీటన్నింటినీ పక్కన పెట్టి ఆదివాసి దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుతున్నామని మభ్యపెడుతూ ప్రభుత్వాలు వారికి తీరని ద్రోహం చేస్తున్నాయని ఆగ్రహం చెందుతున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా గిరిజనుల తలరాతలు మాత్రం మారలేదు. నేటి ఆధునిక యుగంలో టెక్నాలజీని ఉపయోగించుకుని రహదారులు, ఆసుపత్రులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ వాటన్నిటినీ విస్మరిస్తూ ప్రభుత్వాలు కేవలం ప్రకటనలకే పరిమితం అవుతూ పాలన సాగిస్తూ ఆదివాసులను మోసం చేస్తున్నాయని మేధావులు అంటున్నారు. అభివృద్ధిని పక్కన పెట్టి గిరిగ్రామాల సమస్యలను విస్మరించి పాలన సాగిస్తున్నప్పుడు ఆదివాసి దినోత్సవం ఏ విధంగా ఘనంగా జరుపుకోవాలని గిరిజనులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసీలను మభ్య పెట్టే పనిలో పాలకులు ఉన్నారని ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో పట్టణాలు అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్నా, గిరి పల్లెలు మాత్రం ఎందుకు ప్రగతి పథంలో పయనించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి అంటే ప్రభుత్వాలకు చులకన అంటూ ప్రశ్నలను సంధిస్తున్నారు. పాలకుల్లో మార్పు రావాలని, ఏజెన్సీ ప్రాంతాలలో పనిచేసే అధికారులకు గిరిజన అభివృద్ధిపై మక్కువ ఉండాలని, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని, గిరిజనులను అభివృద్ధి, ఆర్థిక బాటలో నడిపించినప్పుడే ఆదివాసీ దినోత్సవానికి ఓ సార్థకత ఏర్పడుతుందని, అలా కానప్పుడు ఏటా ఎంత ఘనంగా ఆదివాసి దినోత్సవ జరుపుకున్నా గిరిజనులకు కష్టాలు, కన్నీళ్లు, వేదనలు, రోదనలు తప్పవని ప్రజా సంఘాల నాయకులు అంటున్నారు. వచ్చే ఏడాది నాటికైనా మన్య ప్రాంతంలో సమస్యల పరిష్కారానికి పాలకులు కృషిచేసి గిరిజనుల అభివృద్ధికి బాటలు వేస్తారని ఆశిద్దాం.

'గోరంట్ల'పై చర్యలేవి?

(మొదటిపేజీ తరువాయి)

సాగిస్తున్నా.. ఇంకా ఒక నిర్ణయానికి రాలేకపోతోంది. ఆయనపై వేటు వేస్తే పార్టీకి జరిగే లాభ నష్టాలపై బేరీజు వేస్తోంది. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాత్రం ఆ వీడియోలో మార్ఫింగ్ జరగలేదని తేలితే కఠిన చర్యలుంటాయని చెప్పి చేతులు దులుపుకున్నారు. వాస్తవానికి ఆ వీడియో అసలో, నకిలీయో వైసీపీ అధిష్ఠానానికి తెలుసునని, కాని గోరంట్లపై చర్యలు తీసుకోవడం ద్వారా తర్వాత జరిగే పరిణామాలపైనే వెనుకాడుతున్నారని వైసీపీ నేతల్లో చర్చ జరుగుతోంది. అందుకే ఫోరెన్సిక్ దర్యాప్తు పేరుతో కాలయాపన చేస్తున్నారు. రాసలీలల వీడియో నిజమేనంటూ ఫోరెన్సిక్ నిపుణులు తేల్చితే వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసినా, లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేయించినా, దానివల్ల పార్టీకి వచ్చే లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని అధిష్ఠానం భయపడుతున్నట్లు నేతలు చర్చించుకుంటున్నారు. గతంలో మంత్రిగా పనిచేసిన అవంతి శ్రీనివాస్ ఆడియో, ప్రస్తుతం మంత్రిగా వ్యవహరిస్తున్న అంబటి రాంబాబులకు సంబంధించిన గంట, అరగంట అంటూ వారు మాట్లాడిన ఆడియోలు బయటకు వచ్చినప్పుడు వారిపై అధిష్ఠానం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు గోరంట్లపై చర్యలు తీసుకుంటే బీసీ కాబట్టే వేటు వేశారని అంతా భావించే ప్రమాదం ఉందని, ఇది రాజకీయంగా పార్టీకి నష్టం చేస్తుందన్న కోణంలో అధిష్ఠానం ఆలోచిస్తూ, విచారణ పేరుతో కాలయాపన చేస్తూ ఈ సమస్యను మరుగున పడేయడమే మంచిదన్న భావనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే గోరంట్ల మాధవ్ వీడియో వ్యవహారంపై విచారణ కోరుతూ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ శనివారం డీజీపీకి లేఖ రాసినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. గోరంట్ల వీడియో వ్యవహారంలో వైసీపీ అధిష్ఠానం పూర్తి చిత్తశుద్ధితో పనిచేసినట్లు నిరూపించుకునేందుకే ఫోరెన్సిక్ నివేదిక పేరుతో జాప్యం చేయడం, మరోపక్క మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌తో డీజీపీకి విచారణ కోరుతూ లేఖ రాయడం వంటి దిగజారుడు విధానాలను అవలంబిస్తున్నారని ప్రతిపక్షనేతలు విమర్శిస్తున్నారు. వైసీపీలోనే మరోవర్గం మాత్రం గోరంట్లపై ఖచ్చితంగా చర్యలుంటాయని చెబుతున్నారు. శనివారం ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో గోరంట్ల ఓటు వేయాల్సి ఉండడం, ఆదివారం సీఎం జగన్ హస్తిన పర్యటన నేపథ్యంలో ఆయనపై వేటుకు ఆలస్యమైందని విశ్లేషిస్తున్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత కచ్చితంగా గోరంట్లపై వేటు ఖాయమని, లేనిపక్షంలో పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వ్యాఖ్యానిస్తున్నారు.

నేడు నీతిఆయోగ్ కౌన్సిల్ సమావేశం

పంట వైవిధ్యం, ఎన్ఈపీపై చర్చ

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతను నీతిఆయోగ్ పాలకమండలి ఏడవ సమావేశం ఆదివారం జరగనుంది. పంట వైవిధ్యం, జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) అమలు తదితర అంశాలపై సమావేశం చర్చించనుంది. నీతిఆయోగ్ పాలక మండలిలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, అనేకమంది కేంద్రమంత్రులు ఉన్నారు. నీతిఆయోగ్ చైర్మన్‌గా ప్రధానమంత్రి ఉన్నారు. 2019 జులై తర్వాత మండలి తొలిసారి భౌతికంగా సమావేశమవుతోంది. ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు శనివారం ప్రకటించారు. రాష్ట్రాల విషయంలో కేంద్రం చూపుతున్న వివక్షకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో కేసీఆర్ ఘాటైన పదాలతో ఓ లేఖను మోదీకి పంపారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందినప్పుడు మాత్రమే భారత్ శక్తిమంతం కాగలదని నొక్కిచెప్పారు. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీతో పాటు అనేక అంశాలను లేవనెత్తుతానని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తెలిపారు.

మూడేళ్ల తర్వాత నీతిఆయోగ్ సమావేశంలో పంజాబ్ తరఫున ప్రాతినిధ్యం ఉండబోతోందన్నారు. ఫెడరల్ వ్యవస్థ కోసం రాష్ట్రపతి ప్రాధాన్యత, జీ20 వేదికపై పురోగతి దిశగా రాష్ట్రాల పాత్ర వంటి అంశాలనూ ఈ సమావేశం చర్చించనున్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది. సమావేశానికి ఏర్పాట్లలో భాగంగా జూన్‌లో ధర్మశాలాలో అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల జాతీయ సదస్సు జరిగింది. గతేడాది ఫిబ్రవరి 20న పాలక మండలి భేటీ అయింది. అయితే పశ్చిమ బెంగాల్, పంజాబ్, తెలంగాణ, గుజరాత్ ముఖ్యమంత్రులు గైర్హాజరయ్యారు. 2020లో కోవిడ్ కారణంగా సమావేశాన్ని నిర్వహించలేదు. 2015, ఫిబ్రవరి 8న నీతిఆయోగ్ పాలక మండలి తొలి సమావేశం జరిగింది.

ధన్‌బాద్ జడ్జీ హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవం

సీబీఐ కోర్టు తీర్పు

ధన్‌బాద్: ధన్‌బాద్ కోర్టు న్యాయమూర్తి హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవ శిక్ష విధిస్తూ ప్రత్యేక సీబీఐ కోర్టు శనివారం తీర్పును వెలువరించింది. వీరిలో ఒకరు ఆటోడ్రైవర్. ఆటోడ్రైవర్ లఖన్ వర్మ, ఆయన సహచరుడు రాహుల్ వర్మను జడ్జీ ఉత్తమ్ ఆనంద్ (49) హత్య కేసులో దోషులుగా నిర్ధారిస్తూ సీబీఐ కోర్టు జస్టిస్ రజనీకాంత్ పాథక్ జులై 28న ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా శిక్షను ఖరారు చేశారు. జీవితఖైదుతో పాటు ఇద్దరికి ఐపీసీలోని 302 సెక్షన్ కింద రూ.20వేల జరిమానా విధించారు. సాక్ష్యాధారాలను మాయం చేయడం, తప్పుడు సమాచారం ఇచ్చిన నేరాల్లో ఐపీసీ సెక్షన్ 201 కింద మరో రూ.10వేల జరిమానాతో పాటు ఏడేళ్ల జైలు శిక్షను విధిస్తూ ఆదేశాలిచ్చారు. రెండు శిక్షలు ఒకదాని తర్వాత ఒకటిగా అమలు అవుతాయన్నారు. జస్టిస్ ఆనంద్ గతేడాది జులై 28న హత్యకు గురయ్యారు. ఆటోతో బలంగా గుద్దిన కారణంగా ఆయన అదే రోజు ప్రాణాలు విడిచారు. ఇలాంటి నేరం చాలా అరుదు అని దోషులను ఉరితీయాలని సీబీఐ న్యాయవాది అమిత్ జిందల్ వాదించారు. జడ్జీ ప్రమాదవశాత్తుల మరణించారని డిఫెన్స్ లయార్ కుమార్ బిమేలేందు తెలిపారు. ఈ తీర్పును ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేస్తామన్నారు. కాగా, ఈ కేసు విచారణ ఫిబ్రవరిలో మొదలు అయింది. మొత్తం 58 సాక్షులను విచారించారు.

వణికిస్తున్న కరోనా

న్యూఢిల్లీ: దేశంలో కరోనా మహమ్మారి వ్యాప్తి అదుపులోనే ఉన్నప్పటికీ.. కొన్ని రాష్ట్రాల్లో ఇటీవల కేసులు పెరుగుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. ఏడు రాష్ట్రాల్లో పాజిటివిటీ రేటు 10శాతం దాటడం కలవరపెడుతోంది. దీంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ వ్యాప్తి కట్టడికి త్వరితగతిన చర్యలు చేపట్టాలంటూ ఆయా రాష్ట్రాలకు సూచించింది. ఢిల్లీ, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో వారపు పాజిటివిటీ రేటు 10శాతం దాటింది. దీంతో కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్..ఆయా రాష్ట్రాల ఆరోగ్య కార్యదర్శులకు లేఖలు రాశారు. వైరస్ వ్యాప్తి కట్టడికి ఐదంచెల వ్యూహాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని, అర్హులైన ప్రజలందరికీ టీకా కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, కోవిడ్ నిబంధనలను తప్పకుండా పాటించేలా చూడాలని భూషణ్ తన లేఖలో సూచించారు. రాబోయేవి పండగ రోజులు కావడంతో సామూహిక కార్యక్రమాలు జరుగుతాయని, దీంతో కరోనా కేసులు మరింత పెరిగే ప్రమాదముందని కేంద్ర ఆరోగ్యశాఖ హెచ్చరించింది. అందువల్ల రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దేశంలో కొన్ని రోజులుగా స్వల్ప హెచ్చుతగ్గులతో రోజువారీ కేసులు దాదాపు 20వేలుగా నమోదవుతున్నాయి. నిన్న దేశవ్యాప్తంగా 19,406 మందికి వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ కాగా..49 మరణాలు చోటుచేసుకున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఆరు నెలల తర్వాత మళ్లీ 2వేల కేసులు నమోదవ్వగా.. మహారాష్ట్ర, కర్ణాటకల్లోనూ రోజువారీ కేసుల సంఖ్య రెండు వేలు దాటింది. తమిళనాడు, కేరళల్లో వెయ్యికి పైగా కేసులు నమోదయ్యాయి.

నేడు నింగిలోకి ఎస్ఎస్ఎల్‌వీ

చెన్నై: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చరిత్ర సృష్టించబోతోంది. తన మొదటి చిన్న ఉపగ్రహాల ప్రయోగ వాహనం 'ఎస్ఎస్ఎల్‌వీ మిషన్'కు సర్వం సిద్ధం చేసింది. ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి ఎస్ఎస్ఎల్‌వీ ద్వారా ఎర్త్ అబ్జర్వేటరీ శాటిలైట్‌తో పాటు విద్యార్థులు తయారు చేసిన ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. ఇదే కేంద్రం నుంచి పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ ప్రయోగాలను విజయవంతం చేసింది. దీంతో ఎస్ఎస్ఎల్‌వీ ప్రయోగానికి శ్రీహరికోటనే ఇస్రో ఎంచుకుంది. ఎస్ఎస్ఎల్‌వీ ద్వారా ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్-02, ఆజాదీ శాట్‌ను నింగిలోకి పంపనుంది. ఆజాదీశాట్‌ను స్పేస్‌కిడ్స్ ఇండియా విద్యార్థుల బృందం తయారు చేసింది. మిగతా ప్రయోగాల మాదిరిగా 25 గంటలకు బదులు ఐదు గంటల కౌంట్‌డౌన్ ఉంటుందని ఇస్రో వర్గాలు తెలిపాయి. ఆదివారం ఉదయం 4.18 గంటలకు కౌంట్‌డౌన్ మొదలై ఉదయం 9.18గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లబోతున్నట్లు వెల్లడించాయి. నిర్దేశిత కక్ష్యలోకి ఉపగ్రహాలను చేర్చేందుకు వీలుగా వెలాసిటీ ట్రిమ్మింగ్ మాడ్యూల్ ఆధారిత నాల్గో దశ లిక్విడ్ పాపులేషన్ ఉండటం ఎస్ఎస్ఎల్‌వీ ప్రత్యేకత. మొదటి మూడు దశలకు సరిపడ ఘన ఇంధనాన్ని రాకెట్ కలిగి ఉంటుంది. 13 నిమిషాల ప్రయాణం అనంతరం ఈఓఎస్-02ను కక్ష్యలోకి ఎస్ఎస్ఎల్‌వీ ప్రవేశపెడుతుంది. ఆ తర్వాత ఆజాదీశాట్‌ను ప్రవేశపెడుతుంది. ఎనిమిది కేజీల క్యూబ్‌శాట్‌ను దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల బాలికలు కలిసి 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తయారు చేశారు. ఇది 75 రకాల పేలోడ్‌లను మోసుకెళ్లగా, వీటి బరువు 50 గ్రాములు చొప్పున ఉంటుంది. గ్రామీణ విద్యార్థినులు ఇస్రో శాస్త్రవేత్తల మార్గదర్శకం, స్పేస్ కిడ్స్ ఇండియా సహకారంతో ఈ ఉపగ్రహాన్ని తయారు చేశారు. ఉపగ్రహం నుంచి డేటా సేకరణకు స్పేస్ కిడ్స్ ఇండియా తయారు చేసిన గ్రౌండ్ సిస్టమ్ వినియోగమవుతుంది. చిన్న ఉపగ్రహాలకు ఉన్న డిమాండు నేపథ్యంలో వాటి తయారీపై ఇస్రో పూర్తిగా దృష్టి కేంద్రీకరించింది. 500 కిలోల బరువు ఉండి 500 కిమీలలో ఎర్త్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టేందుకు వీలుగా వీటిని తయారు చేస్తోంది. ఎస్ఎస్ఎల్‌వీ పొడవు 34 మీటర్లు. పీఎస్ఎల్‌వీ కంటే 10మీటర్లు తక్కువ. వైశాల్యం రెండు మీటర్లు కాగా పీఎస్ఎల్‌వీది 2.8 మీటర్లు. ఎస్ఎస్ఎల్‌వీ 120 టన్నులను మోసుకెళ్లగలదు. పీఎస్ఎల్‌వీ 320 టన్నులను తీసుకెళ్లగలదు. 1800 కేజీల పేలోడ్‌నూ మోయగలదు. 1965 నుంచి ఇస్రో రాకెట్లను ప్రయోగిస్తోంది. 1963 నవంబరులో తిరువనంతపురం నుంచి తొలిసారి రాకెట్ ప్రయోగం జరిగింది.

మోదీ, బాబు మాటామంతీ

(మొదటిపేజీ తరువాయి)

సమావేశం ముగిసిన అనంతరం చంద్రబాబుతో ప్రధాని ఐదు నిమిషాల పాటు ప్రత్యేకంగా ముచ్చటించారు. వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ వివరాలు వెల్లడి కాలేదు. కానీ సుదీర్ఘకాలం తర్వాత వారిద్దరూ కలిసి మాట్లాడుకోవడం రాజకీయవర్గాల్లో ఆసక్తి రేకెత్తించింది. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును చంద్రబాబు కలిశారు. ఇక సీఎం జగన్ కావాలనే సమావేశానికి గైర్హాజరైనట్లు తెలుస్తోంది. చంద్రబాబు హాజరయ్యే సమావేశానికి వెళ్లడం ఇష్టంలేకే, ఆదివారం జరిగే నీతి ఆయోగ్ సమావేశానికి హాజరు కావాలని నిర్ణయించినట్లు సమాచారం. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం బహిరంగంగానే నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. అమృత మహోత్సవ్ సమావేశానికి కూడా గైర్హాజరయ్యారు.

తిరుగుబాటుకు ప్రజలు సిద్ధం: చంద్రబాబు

చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ ఏపీలో ప్రజలు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు వేచి చూస్తున్నారన్నారు. ప్రజల నాడి అర్థం కావడంతో జగన్ తీవ్ర అసహనంతో ఉన్నారని ఎద్దేవా చేశారు. జగన్ అరాచక పాలన సాగిస్తున్నారని, అభివృద్ధి ధ్యాసే లేదని దుయ్యబట్టారు.

ప్రభుత్వ దాష్టీకాలపై మహిళలు పోరాడాలి

జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం విపక్ష పార్టీల కర్తవ్యమని, పరిష్కారానికి కృషి చేయాల్సిన పాలకులు దౌర్జన్యాలకు పాల్పడడం దారుణమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ప్రశ్నించేవారిని అణగదొక్కాలని ప్రయత్నించే ప్రభుత్వ దాష్టీకాలపై మహిళలు ముందుండి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. పది రోజుల క్రితం డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా గంటి పెదపూడిలో వరద బాధల్లో ఉన్న నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు జనసేన పార్టీ వీర మహిళలు ప్రయత్నిస్తే వారిని అడ్డుకోవడం ప్రభుత్వ సంకుచిత ధోరణిని తెలియచేస్తోందని ఆయన మండిపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గంటి పెదపూడిలో వరద సమస్యలపై అధికార పార్టీ ఎమ్మెల్యేను ధైర్యంతో నిలదీసిన వీరమహిళలకు పవన్ కల్యాణ్ వెండి మహిషాసుర మర్దిని అమ్మవారి ప్రతిమలను బహూకరించి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనకు వస్తుంటే, ముందుగా అక్కడున్న నాయకులను గృహ నిర్బంధాలు చేస్తున్నారని అన్నారు. వరద బాధిత కుటుంబాలకు రూ.10 వేల ఆర్థిక సాయం ఇవ్వమని మేం కోరుతుంటే మీకు ఉలుకెందుకని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులను ధైర్యంగా ఎదుర్కొని నిలబడుతున్న వారిని ఇష్టానుసారం బూతులు తిడుతున్నారు, కేసులు పెడుతున్నారని అన్నారు. అడ్డగోలు కేసులకు, బెదిరింపులకు భయపడకుండా ధైర్యంగా నిలబడే వీర మహిళలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో మహిళల పాత్ర మరింత పెరగాలని, చట్ట సభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు జరిగేలా అన్ని పార్టీలు కృషి చేయాలని కోరారు.

నేడు కోపూరి శ్రీనివాస్ స్మారక పురస్కారాలు

విశాలాంధ్ర- విజయవాడ: రమ్యభారతి సాహిత్య త్రైమాస పత్రిక ఆధ్వర్యంలో ఆదివారం బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో కోపూరి శ్రీనివాస్ స్మారక విశిష్ట పురస్కారాల (సింగిల్ పేజీ కథలపోటీ బహుమతి ప్రదానోత్సవం) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కోపూరి కుటుంబం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రమ్యభారతి గౌరవ సంపాదకులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య అధ్యక్షతన జరిగే సభలో ప్రథమ బహుమతి వేణు మరీదు- ఖమ్మం, ద్వితీయ బహుమతి జి. రంగబాబు- అనకాపల్లి, తృతీయ బహుమతి పాణ్యం దత్తశర్మ- హైదరాబాద్, ప్రోత్సాహక బహుమతులు పురిమళ్ళ సునంద, ఆర్.ఎస్. వెంకటేశ్వరన్, ఎం.వి.ఎస్.రామశేషు, శైలజామిత్ర, తులసి బాలకృష్ణ, బి.వి.శివప్రసాద్, దొండపాటి కృష్ణ, గంటి రాజేశ్వరి, కె.వి.లక్ష్మణరావు, వియోగిలకు ప్రదానం చేయనున్నట్టు వివరించారు. గుమ్మా సాంబశివరావు, కాపూరి సత్యవతి, పులిపాటి దుర్గారావుకు విశిష్ట పురస్కారాలు అందజేయనున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ, ఆత్మీయ అతిథిగా సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి శాంతిశ్రీ విచ్చేస్తారని, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

నెల రోజులే గడువు

- ఆలోగా హామీ నెరవేర్చాలి
- అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి
- సెప్టెంబర్ 6న విజయవాడలో ర్యాలీ
- అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మరో నెల రోజులు గడువు ఇస్తున్నామని, ఈలోగా ప్రభుత్వం స్పందించి అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసోసియేషన్ అధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. 'మాట తప్పను మడమ తిప్పనని' తాము అధికారం చేపట్టిన వారంలో అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని ఎన్నికల వాగ్దానంగా ఆనాడు జగన్‌మోహన్ రెడ్డి చెప్పారని, నేటికి 38 మాసాలు గడచిందనీ, జగన్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. మరణించిన అగ్రిగోల్డ్ బాధితుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా పూలలో పెట్టి మరీ ఇస్తామన్నారని, కానీ అది నేటికి అమలు జరుగలేదన్నారు. ప్రభుత్వం వద్ద డబ్బు లేదా... పూలు దొరకలేదా లేక అగ్రిగోల్డ్ బాధితుల పట్ల నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. నవంబర్ 7, 2019న తొలిగా రూ.10 వేల లోపు అగ్రిగోల్డ్ బాధితులకు రూ.264 కోట్లు విడుదల చేశారని, అనంతరం ఉద్యమాల తర్వాత గత ఆగస్టు 24న మరో రూ.667 కోట్లు రూ.20 వేల లోపు బాధితులకు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు రూ.167 వేల కోట్లు అప్పులు చేసిన ప్రభుత్వం, 20 లక్షల మంది అగ్రి బాధితులకు కేవలం రూ.4 వేల కోట్లు చెల్లించలేకపోతుందా అని అన్నారు. ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యం చెప్పిన లెక్కల ప్రకారం అగ్రిగోల్డ్ ఆస్తి సుమారు రూ.22 వేల కోట్ల నుంచి రూ.36 వేల కోట్ల వరకు ఉందని గుర్తుచేశారు. మరీ ఈ వేల కోట్ల ఆస్తులను వైసీపీ నేతలు చెప్పినట్లు గత ప్రభుత్వ పెద్దలు కాజేస్తే దానిపై విచారణ జరిపించాలని, ఒకవేళ వైసీపీ ప్రభుత్వానికి కంపెనీ యాజమాన్యంతో స్నేహబంధాలు ఉంటే తక్షణమే వాటిని తెంచుకోవాలన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చే ప్రతి రూపాయి కంపెనీ ఆస్తుల అమ్మకం ద్వారా ప్రభుత్వం జమ చేసుకోవచ్చని సూచించారు. అటాచ్ అయిన అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తులపై ప్రభుత్వానికి సర్వ హక్కులు ఉంటాయని, తక్షణమే అగ్రి బాధితులను ఆదుకునే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విజ్ఞాపన పత్రాలు అందజేస్తూ మరో నెల రోజుల పాటు వేచి చూస్తామని, అప్పటికీ ప్రభుత్వం ద్వారా బాధితులకు న్యాయం జరుగని పక్షంలో సెప్టెంబర్ 6న విజయవాడలో భారీ ర్యాలీ నిర్వహించి బాధితుల ఆగ్రహజ్వాలలు ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంత్రూ నాయక్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులు వేసిన ఓట్లతో అధికారం చేపట్టిన జగన్ మోహన్ రెడ్డి బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ అమరావతి రాజధాని, మద్యపాన నిషేధం, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనపై జగన్ మాట తప్పి మడమ తిప్పారన్నారు. అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునే విషయంలో మడమ తిప్పనీయమని స్పష్టం చేశారు. అనంతరం డీఆర్వో చంద్రశేఖర రావుకు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బీవీ చంద్రశేఖర్ రావు, నగర గౌరవాధ్యక్షుడు కోట మాల్యాద్రి, సభ్యులు నాగరాజు, అంజనీదేవి, పెద రామయ్య, కోటేశ్వరమ్మ, అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

ఉక్కు యాజమాన్యం కుట్రను తిప్పి కొట్టండి

541వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: ఉక్కు యాజమాన్యం కుట్రను తిప్పి కొట్టాలని పోరాట కమిటీ ప్రతినిధులు, కార్మికులు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ అధ్వర్యాన కూర్మన్నపాలెంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరహార దీక్షలు 541రోజుకు చేరుకున్నాయి. ఎస్.బి.ఎం, ఎల్.ఎం.ఎం.ఎం కార్మికులు పాల్గొన్నారు. ఈ దీక్షా శిబిరం ఉద్దేశించి పోరాట కమిటీ ప్రతినిధులు బీ మురళిరాజు, వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్లాంట్‌లో కోకింగ్ కోల్ నిల్వలు ప్రమాదస్థాయికి చేరాయని ఆందోళన వ్యక్త చేశారు. యాజమాన్యం ఉక్కు ఉత్పత్తులు తయారీకి కావాల్సిన ముడి సరుకు సమకూర్చడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని, ఇది కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ కుట్రలో భాగమేనన్నారు. రోజుకో విభాగాల్లో ఉత్పత్తి నిలిపివేస్తూ కొన్ని విభాగాలను ప్రైవేటు వారికి కట్టబెట్టాలని యత్నించడం దుర్మార్గమైన చర్య అన్నారు. బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత కార్పొరేట్‌లకు ఏడాదికి 2 లక్షల కోట్లు మాఫీ చేస్తూ ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్లు రుణాలను మాఫీ చేశారన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలన్నారు. సంపన్నుడు ఇస్తే రైట్ ఆఫ్, పేదవాడికి పింఛన్ ఇస్తే అది పెద్ద తప్పుగా అభివర్ణిస్తున్న ప్రభుత్వాల ధోరణి మారాలన్నారు. విశాఖ ఉక్కు ప్రభుత్వంలోనే కొనసాగుతుందని, అవసరమైతే ప్రాణ త్యాగాలు చేసైనా ఈ పరిశ్రమను నిలబెట్టుకుంటామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ దీక్షలో గుమ్మడి నరేంద్ర, డీవీ రెడ్డి, నర్సింగ రావు, త్రినాథ్, భాస్కర్‌రావు, సీతారాజు, రాము, రమణ, గోవిందరాజు, సత్యా నారాయణ, నాగరాజు, వెంకటేశ్వరరావు, దుగ్గపు ధనంజయ్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సమక్షంలోనే ప్రజాప్రతినిధులపై దాడులా?

డీజీపీకి టీడీపీ అధినేత చంద్రబాబు లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పాలకొల్లులో టిడ్కో ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో పోలీసుల సమక్షంలోనే వైసీపీ నేతలు టీడీపీ ప్రజాప్రతినిధులపై దాడికి పాల్పడడంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి శనివారం టీడీపీ అధినేత చంద్రబాబు లేఖ రాశారు. పెంకులపాడు టిడ్కో ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్‌కు అనుగుణంగా పాల్గొన్న ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌లను వేదికపైకి వెళ్లనీయకుండా వైసీపీ శ్రేణులు అడ్డుకున్నారు. అనంతరం వారిపై దాడి చేశారు. ఈ దాడిలో కిందపడిన ఎమ్మెల్యే రామానాయుడు గాయపడ్డారు. వైసీపీ అనుచరుల దౌర్జన్యకాండపై అక్కడే ఉన్న డీఎస్పీ సహా పోలీసులు ఎవరూ స్పందించకపోవడం విస్మయం కల్గిస్తోంది. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రజా ప్రతినిధులకు సంబంధించి తీవ్రమైన ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరిగాయి. పోలీసుల సమక్షంలోనే ఇద్దరు ప్రజా ప్రతినిధులకు రక్షణ లేదంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటి? ఘటనపై సమగ్ర విచారణ జరిపి అలసత్వం ప్రదర్శించిన పోలీసులతో పాటు దాడికి పాల్పడిన వైసీపీ గూండాలపై చర్యలు తీసుకోవాలి. పోలీసులు సమర్థవంతంగా, నిజాయతీగా వ్యవహరించడం ద్వారా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ఈ లేఖతో పాటు నేతలపై దాడికి సంబంధించి వీడియోలు, ఫోటోలు జత చేసి పంపారు.

మాధవ్ వ్యవహారంపై

సీఎం స్పందించరేం? జగదీశ్

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ అసభ్యకర ప్రవర్తన దేశానికి తలవంపులుగా ఉందని వెంటనే వైసీపీ నుంచి అతడిని సస్పెండ్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సభ్య సమాజం తలదించుకునేలా ఎంపీ వ్యవహరించిన తీరు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందన్నారు. అయినా దీనిపై సీఎం స్పందించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. పక్కల రాష్ట్రాల్లో జరిగిన ఘటనలు చూసైనా సీఎం స్పందించాలని డిమాండ్ చేశారు. తనవి నకిలీ వీడియోలంటూ బుకాయించిన ఎంపీ గోరంట్ల మాధవ్ ముఖం చాటేసి రెండు రోజులుగా పార్లమెంటుకు ఎందుకు వెళ్లడంలేదని సూటిగా ప్రశ్నించారు. మాధవ్ నగ్న వీడియోలు నిజమేనని అతని అంతరాత్మకే తెలుసునని పైగా మీడియాను నిందిస్తున్నాడని దుయ్యబట్టారు. మాధవ్‌ను అన్ని వర్గాల ప్రజలు అసహ్యించుకుంటున్నారని ఇప్పటికే నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాల్సిందని ఏకరువు పెట్టారు. జిల్లాలో వైసీపీ నాయకులు ఏ ఒక్కరూ మాధవ్‌ను సమర్థించడం లేదని వారి మౌనమే మాధవ్ వ్యవహారం తప్పని తెలుస్తోందన్నారు. గోరంట్ల మాధవ్‌పై అత్యాచారం కేసు ఉన్నప్పటికీ జగన్ ఆయనకు ఎలా అవకాశం ఇచ్చారో అర్థం కావడం లేదన్నారు. తనపై ఆరోపణలు తోసిపుచ్చేందుకు ఎంపి మాధవ్ మీడియా ఎదుటే మీడియాను బూతులు మాట్లాడుతూ తన దిగజారుడు తనాన్ని నిరూపించుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కురుబ సామాజిక వర్గమే మాధవ్‌ను అసహ్యించుకుంటోందని, ఎంపీగా ఆ సామాజిక వర్గాలు మాధవ్ చేసిందేమీ లేదన్నారు. కురుబ సామాజిక వర్గం ఆత్మగౌరవం దెబ్బతినకుండా, బీసీల ఆగ్రహానికి గురికాకుండా మాధవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాధవ్ పై చర్యలు తీసుకునేందుకు ఏ ఫోరెన్సిక్ నివేదకలు అవసరం లేదని తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కులాలకు రాజకీయాలకతీతంగా సీపీఐ స్పష్టం చేస్తోందని బలహీన ముఖ్యమంత్రిగా చరిత్రలో మిగిలి పోకుండా గోరంట్ల మాధవ్ పై చర్యలు తీసుకోవాలన్నారు. గోరంట్ల మాధవ్ వెకిలి చేష్టలు, అసభ్య ప్రవర్తన రాష్ట్ర ప్రజల మదిలో నిలిచి పోయిందని జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో కూడా మాధవ్ అడుగు పెట్టలేడని తేల్చి చెప్పారు. కాలయాపన చేయకుండా సీఎం జగన్ మాధవ్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, నగర కార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శులు రమణ, అల్లిపిరా పాల్గొన్నారు.

9న సేవ్ ఆంధ్రప్రదేశ్ ధర్నా: ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: 'సేవ్ ఆంధ్రప్రదేశ్, సేవ్ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు, సేవ్ వర్కింగ్ క్లాస్' అనే నినాదంతో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈనెల 9వ తేదీన ఏఐటీయూసీ అధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జీ ఓబులేసు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికులపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందన్నారు. ఏఐటీయూసీ పోరాట ఫలితంగా భవన నిర్మాణ కార్మిక చట్టం రూపొందిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణం కార్మిక సంక్షేమ బోర్డు నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లించిందని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన 33 వేల క్లయిములు అపరిష్కృతంగా ఉన్నాయని, కార్మిక శాఖ మంత్రి వీటిని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారికి సంబంధించిన భవిష్య నిధి రూ.3 వేల కోట్లు, 11వ పీఆర్సీ ప్రకారం చెల్లించాల్సిన రూ.7 వేల కోట్లు చెల్లించకుండా ఉద్యోగులను ముఖ్యమంత్రి జగన్ మోసం చేశారన్నారు. ఇదేమని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించి, ఉద్యమాలను పోలీసులచే బల ప్రయోగం చేసి అణిచి వేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగ సంఘాలు మాత్రం రాయబారాల పేరుతో కాలయాపన చేస్తూ నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. పౌరసరఫరాల శాఖ హమాలీలకు కూలి రేట్లు పెంచకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందనీ, 2021 డిసెంబరు 31 అగ్రిమెంట్ గడువు ముగిసినా నూతన అగ్రిమెంట్ విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 2022 జనవరి 1 నుంచి నూతన కూలి విధానం అమలు చేయాల్సిన అవసరం ఉందని ఈ విషయమై ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం శూన్యమన్నారు. సమస్యలు పరిష్కరించాల్సిన సీఎం జగన్ మౌనముని లాగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 వ్యవసాయ, కార్మిక చట్టాలలో 29 చట్టాలను రద్దుచేసి, 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గానికి బీజేపీ ప్రభుత్వం తీవ్ర నష్టం చేకూర్చిందన్నారు. 2024లో బిల్లు చట్టం చేస్తామని చెప్పి ప్రస్తుత సంవత్సరంలోనే చట్ట సవరణ సాకారం చేసుకునేందుకు కుట్ర పన్నుతోందన్నారు. కార్మిక చట్టాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి అంశంగా ఉన్నందున రాష్ట్రాలు అనుమతించాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో చట్ట సవరణకు అంగీకారం తీసుకొని, మిగిలిన రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకొస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 25, 26న తిరుపతిలో కేంద్ర ప్రభుత్వం దేశంలోని కార్మిక శాఖ మంత్రులు, కార్మిక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి ఆమోదింప చేసుకోవడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. దీనిని ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. కార్మిక, ప్రజా ఉద్యమాలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుటిల యత్నాలను, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడానికి కలిసి వచ్చే అన్ని పక్షాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించి సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్, ఎస్ఆర్ఎం మధ్య ఎంవోయూ

విశాలాంధ్ర-విజయవాడ: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రారంభించిన నూతన అంకుర సంస్థలకు 'ఇండ్ స్ప్రింగ్ బోర్డు పథకం' కింద రూ.50 కోట్ల వరకు కొల్లాటరల్ ఫ్రీ లోన్స్ సమకూర్చేందుకు ఇండియన్ బ్యాంక్ ముందుకొచ్చింది. దీంతో అంకుర సంస్థలు ప్రారంభించిన విద్యార్థులకు ఆర్థిక పరమైన సమస్యలకు పరిష్కార మార్గం లభించినట్లయింది. ఈ మేరకు ఎస్ఆర్ఎం, ఇండియన్ బ్యాంక్ అధికారులు శనివారం గుంటూరు జోనల్ కార్యాలయంలో సమావేశమై ఎంవోయూ చేసుకున్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమకుమార్, ఎంటర్ ప్రెన్యూర్షిప్ అసోసియేట్ డైరెక్టర్ ఉదయన్ భక్షి, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ సీడీ రామారావు, డిప్యూటీ జోనల్ మేనేజర్ సి.జగన్‌మోహన్ రావు సంబంధిత ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఐసీ అండ్ పీఆర్ హెడ్ జయప్రకాశ్ నారాయణ్, ఇండియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి

పోలీసులు అడ్డుకున్నా పిన్నాపురం గ్రామానికెళ్లిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గంలోని పిన్నాపురం రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25లక్షల పరిహారం ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ నంద్యాల జిల్లా సమితి అధ్వర్యంలో పాణ్యం మండలం పిన్నాపురం గ్రామానికి వందలాది మంది సీపీఐ కార్యకర్తలు 'ఛలో పిన్నాపురం' నిర్వహించారు. పాణ్యం పోలీసులు గ్రామానికి వెళ్లకుండా అడుగడుగునా పికెట్ ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. మూడు గ్రూపులుగా కార్యకర్తలు విడిపోయి ఎలాగైనా గ్రామంలోకి ప్రవేశించి ఆ గ్రామ రైతులకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో పోలీసులు అడ్డుకున్న లెక్కచేయకుండా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రఘురాంమూర్తి, భాస్కర్, జిల్లా సమితి సభ్యులు రమేష్, భార్గవ్, బాలకృష్ణ, సుబ్బారెడ్డి, సంజీవులు, సుబ్బరాయుడు, సోమన్న గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభకు ప్రజలు మద్దతు తెలిపారు. రామాంజనేయులు, రంగనాయుడు మాట్లాడుతూ పాణ్యం మండలం, పిన్నాపురంలో గ్రీన్ కో సంస్థ రైతులను మోసం చేసి ఆరువేల ఎకరాల భూమిని 2018లో లాక్కొని రైతులకు కేవలం రూ.9 లక్షల నష్టపరిహారం కొంతమందికి మాత్రమే చెల్లించారని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూమి కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని చట్టంలో ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడం లేదన్నారు. ప్రశ్నిస్తే రైతుల పైన పోలీసులు కేసు నమోదు చేసి భయపెట్టడం సరికాదన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని అనేకసార్లు ప్రజలు గెలిపిస్తే నేడు పిన్నాపురం గ్రామంలో రైతులకు చాలా అన్యాయం చేస్తున్నారని ఆయన ప్రజల వైపా..? లేక గ్రీన్ కో సంస్థ వైపా...? అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పిన్నాపురం గ్రామ రైతులకు, భూ నిర్వాసితులకు సీపీఐ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. పాణ్యం ఎస్సై సుధాకర్ రెడ్డి సీపీఐ కార్యకర్తల ఆందోళన అడ్డుకోవాలని రాగా గ్రామ మహిళలు ఎస్ఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీపీఐ నాయకులను అడ్డుకున్న పోలీసులు

గ్రామంలోకి వెళ్లిన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే ప్రసాద్, జిల్లా సమితి సభ్యుడు చెన్నయ్య, హరినాథ్, జిల్లా ఏఐటీయూసీ నాయకులు శ్రీను, నారాయణమ్మ, సుమారు 100మందిపైగా సీపీఐ కార్యకర్తలను పోలీసులు నిర్బంధించారు. పోలీసుల తీరుపై సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్టూనిస్ట్ హరికి అరుదైన గౌరవం

అంతర్జాతీయ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌కు అమెరికా ఆహ్వానం

విశాలాంధ్ర-విశాఖపట్నం: నగరానికి చెందిన సామాజిక కార్యకర్త బి.హరి వెంకటరమణకు అరుదైన గౌరవం దక్కింది. ఇంటర్నేషనల్ విజిటింగ్ లీడర్‌షిప్ కార్యక్రమానికి విచ్చేయాలంటూ అమెరికన్ ప్రభుత్వం ఆహ్వానం పలికింది. బాలల విద్య, భాగస్వామ్యం, రక్షణ, అక్రమ రవాణా నిరోధం, వెట్టి చాకిరి నిర్మూలన తదితర సామాజిక అంశాలపై ఆయన పలు జాతీయ, అంతర్జాతీయ ఎన్‌జీవో సంస్థలతో కలిసి గత పదిహేను సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. అనేక ప్రభుత్వ కమిటీలలో సభ్యులుగా ఉన్నారు. 'మానవ అక్రమ రవాణా' అంశంపై పుస్తకం రచించడంతో పాటు, విశాఖ నగరంలోనూ, గిరిజన ప్రాంతంలోనూ బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్‌తో కలిసి పనిచేశారు. కార్టూనిస్టు, యానిమేటర్ కూడా అయిన హరి, పిల్లల అంశాలపై అనేక యానిమేషన్ చిత్రాలను, పోస్టర్లను, ఫ్లిప్ బుక్‌లను రూపొందించారు. సమకాలీన పిల్లల సమస్యలపై పలు పత్రికలలో వ్యాసాలు రాస్తున్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా విశాలాంధ్ర దినపత్రికలో 'ఇదీ లోకం' శీర్షికతో పాకెట్ కార్టూన్లు వేస్తున్నారు. ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 2 వరకు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో నిర్వహించే వివిధ సదస్సుల్లో హరి పాల్గొంటారు. సర్వీసెస్ టు ద కమ్యూనిటీ విభాగంలో ఆయన ఇప్పటికే 2012 సంవత్సరానికి భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక యువజన అవార్డు అందుకున్నారు.

ఆదివాసుల యాజమాన్య హక్కులు కాపాడండి

హెచ్ఆర్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర- విశాఖపట్నం: ఆదివాసీయేతరులకు అనుకూలంగా జూన్ 14న జారీ చేసిన నోట్‌ను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సుధ, ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సమన్వయ కమిటీ సభ్యులు వీఎస్ కృష్ణ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ఆదివాసీయేతరులకు ఇళ్లు సమకూర్చేందుకు వీలుగా 1.5 సెంట్ల విస్తీర్ణం గల భూమిపై వారికి స్వాధీన, అనుభవ హక్కులు కల్పిస్తూ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని ఆ నోట్‌లో పేర్కొనడం చట్ట విరుద్ధమన్నారు. స్వాధీన, అనుభవ సర్టిఫికెట్లు మంజూరు చేయడమంటే భూమి బదలాయింపు కాదు గనుక ఏపీ షెడ్యూల్డ్ ప్రాంతాల భూమి బదలాయింపు నియంత్రణ చట్టం (ఎల్‌టీఆర్) 1959/1970 ఉల్లంఘనకు దారితీయదని ఆ నోట్లో సమర్థించుకోవడం దగాకోరుతనమేనని దుయ్యబట్టారు. 1970 ఫిబ్రవరి 3 నుంచి 1/70 నిబంధన అమల్లోకి వచ్చిందనీ, దీని ప్రకారం ఏజన్సీ ప్రాంతంలో ఆదివాసీల భూములను ఆదివాసీయేతరులు కొనుగోలు చేయడానికి వీలులేదని అన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలోని భూములన్నీ ఎస్టీలకే చెందుతాయని చట్టం చెబుతోందన్నారు.

ఎల్‌టీఆర్ చట్టాలను త్రికరణశుద్ధిగా అమలుపరచడానికి ఇప్పటి వరకు ఏ ప్రభుత్వమూ ముందుకు రాలేదన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో భూములపై ఆదివాసుల యాజమాన్య హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆయా ప్రాంతాల్లో ఆదివాసీయేతరులు భూములు గుంజుకుపోతున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణమన్నారు. అధికారులు, ఆదివాసీయేతరులు కుమ్మక్కయి దశాబ్దాల కాలంగా ఆదివాసుల భూములను కబ్జా చేస్తున్నారని వారు ఆరోపించారు. ముఖ్యమంత్రి కార్యాలయం జారీ చేసిన ఈ నోట్ వల్ల ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో నివసించే ఆదివాసులు ఆదివాసీయేతరుల చేతుల్లో నిలువ దోపిడీకి గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. భూములను అన్యాక్రాంతం చేసుకోవడం మరింత పెరుగుతుందన్నారు. ఈ నోట్ కేవలం ఎల్‌టీఆర్‌కే కాదనీ, 1997 జులైలో సుప్రీంకోర్టు ఇచ్చిన సమత తీర్పునకు కూడా విరుద్ధంగానే ఉందన్నారు. దగాకోరు, ప్రమాదకర చర్యలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరిచుకోవాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

అందరి చూపూ ధన్కర్ మీదే

అనుకున్నట్టే భారత ఉపరాష్ట్రపతిగా బీజేపీ అభ్యర్థి, బెంగాల్ మాజీ గవర్నర్ జగదీప్ ధన్కర్ సునాయాసంగా విజయం సాధించారు. పార్లమెంటు ఉభయ సభల సభ్యులు మాత్రమే ఉప రాష్ట్రపతిని ఎన్ను కోవడానికి అర్హులు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 34 మంది ఎంపీలు ఈ ఎన్నికల్లో పాల్గొనలేదు. మొత్తం 725 మంది ఎంపీలు ఓటు వేశారు. ఇద్దరు బీజేపీ ఎంపీలు సన్నీ దయాల్, సంజయ్ ధోటే అనారోగ్య కారణంగా ఓటు వేయలేదు. వీరిద్దరూ రాష్ట్రపతి ఎన్నికల్లో కూడా ఓటు వేయలేదు. పార్లమెంటు ఉభయ సభల్లో కలిసి ఎన్.డి.ఎ.కు 441 మంది మద్దతు ఉంది. అయిదుగురు నామినేటెడ్ సభ్యులు కూడా ఎన్.డి.ఎ. అభ్యర్థి జగదీప్ ధన్కర్‌కు మద్దతిచ్చారు. బీజేయేతర పక్షాలైన బిజూ జనతాదళ్, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్, బహుజన సమాజ్ వాది పార్టీ, తెలుగు దేశం, అకాలీదళ్, శివసేనలోని ఏక్‌నాథ్ షిండే వర్గ సభ్యుల మద్దతు కూడా కలిపితే ఎన్.డి.ఎ.కు అదనంగా మరో 81 మంది సభ్యుల దన్ను ఉంది. ప్రతిపక్ష అభ్యర్థి మార్గరెట్ ఆల్వాకు కాంగ్రెస్, డి.ఎం.కె., ఆర్.జె.డి., ఎన్.సి.పి., సమాజ్‌వాది పార్టీ మద్దతు ఉంది. జార్ఖండ్ ముక్తి మోర్చా, ఆమ్ ఆద్మీ పార్టీ, ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేన, తెలంగాణ రాష్ట్ర సమితి కూడా ఆల్వాకు మద్దతు ఇచ్చాయి. మనం అనుసరిస్తున్న విధానం ప్రకారం రాష్ట్రపతి పదవి అలంకార ప్రాయమైందే. కానీ ఉప రాష్ట్రపతి రాజ్యసభ ఉపాధ్యక్షులుగా కూడా ఉంటారు. అందువల్ల రాజ్యసభ నిర్వహణలో ఉపరాష్ట్రపతిగా ఉండే వారు కీలక పాత్ర పోషించే అవకాశం ఉంటుంది. రాజ్యసభ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నప్పుడు ఉపరాష్ట్రపతి సభా నిర్వహణ బాధ్యతతో పాటు సభలో అధికార ప్రతిపక్షాలకు మధ్య ఘర్షణ తలెత్తినప్పుడు తన నిర్ణయాన్ని ప్రకటించ వలసి ఉంటుంది. ఉపరాష్ట్రపతి ఏ పార్టీ అభ్యర్థి అయినా రాజ్యసభ అధ్యక్షుడిగా నిష్పాక్షికంగా వ్యవహరించాలి. మోదీ సర్కారు రాజ్యసభలో కూడా బిల్లులను గట్టెక్కించవలసి ఉంటుంది కనక రాజ్యసభ అధ్యక్షుడి పాత్ర కీలకమైందే అవుతుంది. రాజ్యసభ అధ్యక్షుడిగా వ్యవహరించేటప్పుడు తనను గెలిపించిన పక్షం అభిప్రాయాలకు అనుగుణంగా మాత్రమే వ్యవహరించరాదు. ఏ పక్షం వైపూ మొగ్గు చూపరాదు. రాజ్యసభను ఎగువసభ అంటాం కనక దాని గౌరవ మర్యాదలను పరిరక్షించవలసిన అవసరం కూడా ఉంటుంది. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్, జాకీర్ హుస్సేన్, వి.వి.గిరి, ఆర్.వెంకట్రామన్, కె.ఆర్. నారాయణన్, భైరాన్ సింగ్ షెఖావత్, హమీద్ అన్సారీ లాంటి దిగ్గజాలు రాజ్యసభ నిర్వహణలో చాలా హుందాగా వ్యవహరించారు. పదవీ విరమణ చేస్తున్న ఎం.వెంకయ్య నాయుడు కూడా అపవాదులు రాకుండా చాలావరకు జాగ్రత్త పడ్డారు. బీజేపీ అభ్యర్థులుగా భైరాన్ సింగ్ షెఖావత్, వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతులుగా వ్యవహరించారు. రాజ్యసభ నిర్వహణలో భైరాన్ సింగ్ షెఖావత్ ఎన్నదగిన పాత్ర పోషించారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు రాజ్యసభలో తమ మాటే నెగ్గాలన్న రీతిలో ప్రవర్తించిన సందర్భాల్లో తాను తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులోనూ ఆదర్శప్రాయంగా ఉండేట్టు వ్యవహరి స్తానని చెప్పేవారు. అలాగే ఉన్నారు కూడా. ఒకసారి అధికార, ప్రతిపక్షాల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురైనప్పుడు తాను ఏ పక్షం వేపు మొగ్గనని ప్రకటించడమే కాక అలాగే మసలుకున్నారు. షెఖావత్ బీజేపీ అభ్యర్థే అయినప్పటికీ ఒకసారి పార్లమెంటు సెంట్రల్ హాలులో మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరచిన సెక్యులర్ విధాన విశిష్టతను చాటి చెప్పారు. సెక్యులర్ వాదిగానే ప్రవర్తించారు. షెఖావత్ మరో అడుగు ముందుకు వేసి రాజ్యసభ పిటిషన్ల కమిటీకి ప్రజలు తమ అభ్యర్థనలను పంపిస్తే సభలో ఆ అంశాలు చర్చించడానికి అనువుగా ఉంటుందని చెప్పారు. అక్కడితో ఆగకుండా ఈ విజ్ఞప్తిని అన్ని ప్రధాన పత్రికలలో వ్యాపార ప్రకటన రూపంలో విడుదల చేయించి చరిత్ర సృష్టిం చారు. అంటే పార్లమెంటును ప్రజలకు చేరువ చేయడానికి షెఖావత్ ప్రయత్నిం చారు. పార్లమెంటరీ కమిటీల సభ్యులు ఇతర చోట్లకు విధి నిర్వహణలో భాగంగా పర్యటనలకు వెళ్తే లోకసభ, రాజ్యసభే వారి ప్రయాణ, వసతి ఖర్చులు భరించాలని కూడా షెఖావత్ ఆదేశించారు. ఆ సమయంలో లోకసభ స్పీకర్‌గా ఉన్న సోమనాథ్ చటర్జీ కూడా ఈ ప్రతిపాదనను ఆమోదించారు. పార్లమెంటు కార్యకలాపాలలో ప్రశ్నోత్తరాల సమయం చాలా విలువైంది. ఆ సందర్భంలోనే ప్రజా సమస్యలు పార్లమెంటు దృష్టికి వస్తాయి. మౌఖికంగా ప్రశ్న అడిగదలచిన సభ్యులు కనక ఆ సమయంలో సభలో లేకపోతే ఇతర సభ్యులు ఎవరైనా మూడు అనుబంధ ప్రశ్నలు అడగడానికి కూడా షెఖావత్ అవకాశం కల్పించారు. తదనుగుణంగా రాజ్యసభ నిబంధనలు మార్పించారు. ఈ నిర్ణయానికి సానుకూల ప్రభావం కనిపించింది. తరవాత లోకసభ కూడా ఇదే విధానాన్ని అనుసరించింది.

ధన్కర్ పేరును ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించినప్పుడు ఆయనకు పార్లమెంటరీ కార్యకలాపాల గురించి క్షుణ్ణంగా తెలుసు కనక సభను దేశాభివృద్ధి సాధించడానికి అనువుగా నిర్వహించగలరన్న ఆశాభావాన్ని ప్రధానమంత్రి మోదీ వ్యక్తం చేశారు. అయితే ధన్కర్ బెంగాల్ గవర్నరుగా ఉన్న సమయంలో మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి అడుగడుగునా అడ్డంకులు కల్పించి వివాదాస్పదంగా తయార య్యారు. ధన్కర్ సంయమనం పాటించే వ్యక్తి కాదన్న విమర్శలు వచ్చాయి. గవర్నరుగా ఆయన ఉన్న రాజ్యాంగ పదవికి న్యాయం చేయలేదన్న విమర్శలకూ గురయ్యారు. బెంగాల్ "ఓ గ్యాస్ చేంబర్" అని ధన్కర్ చేసిన వ్యాఖ్య తీవ్ర అలజడి రేపింది. బెంగాల్ గవర్నర్‌కు, ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి మధ్య మర్యాదపూర్వకమైన పలకరింపులు లేకుండా పోయాయి. దీనికి ధన్కర్ వ్యవహార సరళే ప్రధాన కారణం. ఆయన ప్రతిపక్ష నాయకుడిగా కనిపించిన సందర్భాలూ ఉన్నాయి. ధన్కర్ స్వీకరించబోయే పదవిలో ఇప్పటిదాకా ఉన్న వెంకయ్య నాయుడుకు పార్లమెంటు సభ్యుడిగానూ విశేష అనుభవం ఉంది అయినా వివాదాస్పదమైన వ్యవసాయ చట్టాలు ఆమోదించేటప్పుడు ఓటింగుకు అనుమతించకపోవడం ఆయన పక్షపాత దృష్టికే నిదర్శనంగా నిలుస్తుంది. ఒక అంశంపై ఓటింగ్ జరగాలని సభ్యులు కోరితే సభాధ్యక్ష స్థానంలో ఉన్నవారు అంగీకరించవలసిందే. కానీ సభ గందరగోళంగా ఉన్నప్పుడూ ఆ రణగొణ ధ్వనుల మధ్యే మూజువాణి ఓటు పేరుతో బిల్లులను ఆమోదించేట్టు చేయడం రాజ్యసభ అధ్యక్షుడు అధికార పక్షానికి వంతపాడినట్టే లెక్క. ఓటింగుకు అనుమతించకపోవడంవల్ల కొందరు సభ్యులు వెంకయ్య నాయుడు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు దాకా తీసుకెళ్లారు.

హమీద్ అన్సారీ అయితే గందరగోళంగా ఉన్నప్పుడు బిల్లులను ఆమోదించ డానికి అనుమతించే వారు కాదు. వ్యవసాయ చట్టాలను ఆమోదింప చేసేటప్పుడు మోదీ సర్కారు చర్చలు, సంప్రదింపులు అన్న సూత్రాన్ని పాటించలేదు. అందుకే ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఏడాదికి పైగా రైతులు ఉద్యమం చేశారు. ఆ తరవాత మోదీ ప్రభుత్వం ఈ చట్టాలను ఉపసంహరించ వలసి వచ్చింది. సభలో సమగ్రమైన చర్చ లేకుండానే ఆమోదించేస్తున్నారని ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ వ్యాఖ్యానించవలసి వచ్చింది. ధన్కర్ ఎలాంటి వైఖరి అనుసరిస్తారో చూడాలి.

విదేశీ వైద్య విద్యార్థుల జీవితాలలో విషాదం నింపుతున్న ప్రభుత్వాలు

సురేష్ బాబు

పిల్లలు మంచి చదువులు చదివి సకాలంలో జీవితంలో స్థిరపడితే ఆ ఆనందం చెప్పనక్కర్లేదు. బైపీసీ తీసుకొని మధ్యస్థంగా ర్యాంకులు సాధించిన వారు ఇక్కడ సీటు దొరక్క చైనా, రష్యా, ఉక్రెయిన్, ఫిలిప్పైన్స్, నేపాల్, మలేషియా వెళుతుంటారు. వీరందరూ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు. డాక్టర్ కావాలనేది ఎంతోమంది విద్యార్థుల కల! దాన్ని నెర వేర్చుకునేందుకు ఖండాంతరాలు సైతం దాటి వెళ్తున్నారు. వివిధ కారణాల వల్ల వీళ్లంతా ఇప్పుడు ఇంటి దగ్గర ఉండి చాల కాల మైంది. వీరి గురించి పట్టించుకునే ప్రభుత్వాలు కరువయ్యాయి. మా నాయకుడు అక్కడి అధి నేతలతో మాట్లాడి యుద్ధం ఆపి ఆఘమేఘాల మీద తీసుకొచ్చాం అని కొందరు, విమానాలు పంపి తెచ్చామని కొందరు, తిండి లేక అలమటిస్తుంటే అన్నం పెట్టామని ఎవరికి వారు చేసింది కొంత ప్రచారం కొండంత. కరోనా కారణంగా కాలేజీ చదువులు చాలావరకు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా చైనాలో చదువుతున్న భారత విద్యార్థులు మన దేశానికి వచ్చిన తర్వాత తిరిగి అక్కడికి వెళ్లే పరిస్థితే లేకపోయింది. కరోనా కారణంగా విదేశీ పౌరులను తమ దేశంలో అడుగు పెట్టవద్దని చైనా కఠిన చర్యలు తీసుకుంది. అప్పటికే సొంత దేశం వెళ్లిన విద్యార్థుల వీసాలను రద్దు చేసింది. చైనాలో సుమారు 23వేల మంది భారతదేశ విద్యార్థులు చదువుతున్నారు. అందులో చాలా వరకు మెడిసిన్‌నే చదువుతారు. కానీ, కరోనా కారణంగా భారత్‌కు ఆ విద్యార్థులు వచ్చిన తర్వాత మళ్లీ వారిని వెనక్కి తీసుకోవడానికి వీసాలను ఆ దేశం అంగీకరించలేదు. చైనా విదేశాంగ శాఖపై ఈ విషయమై ఒత్తిడి వస్తున్నది. ఈ నేపథ్యంలోనే అటువైపుగా ఇప్పుడిప్పుడే సానుకూల అడుగులు వేసింది. తమ దేశంలో కాలేజీల్లో జాయిన్ అయిన విదేశీ విద్యార్థులను వెనక్కి తెచ్చుకోవడానికి తాము చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. ఉక్రె యిన్‌పై రష్యా మిలిటరీ ఆపరేషన్ కొనసాగుతోంది. ఉక్రెయిన్‌లో 18,000 పైగా భారతీయ విద్యార్థులు చిక్కుకున్నారన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో మొదట యుద్ధం రెండు వారాలు ఉంటుందన్న అంచనా వేశారు కానీ అది నెలల తరబడి కొనసాగుతుండటంతో విద్యార్థులను రప్పించే ప్రయత్నం చేశారు. వారిలో తెలుగు విద్యార్థులు ఉన్నారు. తెలుగు విద్యార్థులు సుమారు 1500 నుంచి 3000 మధ్య ఉన్నారన్న వార్తలొస్తున్నాయి. వారంతా భారత దేశానికి తిరిగి వచ్చారు. ఇక్కడి ప్రభుత్వ సాయం కోరుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఇక్కడ వైద్య కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చుక్కలు చూపుతున్న అధికారులు ఇప్పుడు వీళ్ళను పట్టించుకునే ధోరణిలో లేరు. భారత ప్రభుత్వం కూడా విద్యార్థులను వెనక్కి తీసుకువచ్చేందుకు కావాల్సిన చర్యలు తీసుకుంది కానీ వారి చదువుల కొనసాగింపు విషయంలో మీన మేషాలు లెక్కిస్తోంది. ఉక్రెయిన్‌కు వెళ్లిన విద్యార్థుల్లో ఎక్కువమంది అక్కడ మెడిసిన్ చదవడానికి వెళ్లిన వారే. మిగతావారు ఇంజనీరింగ్ కోసం వెళ్తుంటారు. అయితే అమెరికా, ఆస్ట్రేలియా, చైనా లాంటి దేశాలు ఉండగా ఉన్నత విద్య కోసం ఉక్రెయిన్‌కు ఎందుకు వెళ్లారన్న చర్చ ఇప్పుడు జరుగు తోంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధంతో ఈ టాపిక్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఉక్రెయిన్‌లోని మెడికల్ కాలేజీల్లో మెడిసిన్ కోర్సులు చదువుతున్నవారిలో భారతీయ విద్యార్థులే ఎక్కువ. తక్కువ మందే ఇంజనీరింగ్ కోర్సులు చేస్తుంటారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు 480 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్కీవ్ నేషనల్ మెడికల్ యూనివర్సిటీలోనే మెడిసిన్ కోర్సుల్లో చేరినవారు ఎక్కువ. ఉక్రెయిన్‌లోని మెడికల్ కాలేజీలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు ఉంది. అక్కడి కాలేజీల్లో చదివిన డిగ్రీలు భారత దేశంలో చెల్లుతాయి. ఆ కోర్సుల్ని ఇండియన్ మెడికల్ కౌన్సిల్ గుర్తించింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో ఉక్రెయిన్‌లో చదువుతున్న భారత్ విద్యార్థులందరూ వెనక్కి వచ్చారు. ఈ పరిస్థితుల్లో వైద్యవిద్య కొనసాగించేందుకు వారు కొన్ని వెసులుబాట్లు కోరుకుంటున్నారు. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) ఇప్పటికే కొన్ని నిర్ణయాలు తీసుకుంది. వాటితో ప్రయోజన ముందా? అంటే ఏమాత్రం లేదని చెప్పాలి. జాతీయ వైద్య మండలి గతేడాది నవంబరు 18న జారీ చేసిన ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ నిబంధనల ప్రకారం, ఏ దేశంలో వైద్యవిద్య చదివితే అక్కడే ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి రావాలి. ఈ నిబంధనను సడలిస్తున్నట్లు ఎన్ఎంసీ తాజాగా ప్రకటించింది. ఉక్రెయిన్‌లో వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు మనదేశంలో ఇంటర్న్‌షిప్ చేసేం దుకు అను మతించింది. ఇందుకు ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజీఈ) లో ఉత్తీర్ణత సాధించాలని షరతు విధించింది. సాధారణంగా చైనా, బంగ్లాదేశ్, నేపాల్, కజకిస్థాన్, కిర్గిస్థాన్‌లలో ఐదేళ్ల చదువు, ఏడాది ఇంటర్న్‌షిప్ పద్ధతిలో వైద్యవిద్య అందిస్తున్నారు. రష్యా, ఉక్రెయిన్, జార్జియా, బెలారస్, ఫిలిప్పీన్స్‌లలో ఆరేళ్ళ చదువు ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ విధానం ఉంది. చైనా, బంగ్లాదేశ్, నేపాల్‌లలో ఎంబీబీఎస్ డిగ్రీలోనే ఇంటర్న్‌షిప్ ఒక భాగం. మిగిలిన అన్ని దేశాల్లో డాక్టర్ ఆఫ్ మెడిసిన్ (ఎండీ) చదువుతో సమానం. అక్కడ చదువు పూర్తి చేసుకుని వచ్చిన విద్యార్థులు తప్పనిసరిగా ఇంటర్న్‌షిప్ చేశాకే వారికి పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఇస్తారు. ఈ వెసులుబాటుతో ఉక్రెయిన్‌లో 5వ, 6వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పెద్దగా ప్రయోజనం ఒనగూరదని నిపుణులు చెబుతున్నారు. ఎక్కడ చదివితే అక్కడే ఇంటర్న్‌షిప్ నిబంధనలో సడలింపు గత నవంబరు తర్వాత చేరిన విద్యార్థులకే వర్తిస్తుందని వివరిస్తున్నారు. ప్రస్తుతం ఆఖరి సంవత్సరం అంటే ఐదేళ్ల క్రితం చేరినవారికి పెద్దగా ప్రయోజనం లభించదు. 2018, 2019లో చేరిన విద్యార్థుల సంగతి వర్ణనాతీతం, చాలామంది విద్యార్థులు వైద్య విద్యకు స్వస్తి చెప్పి ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు. పిల్లల భవిష్యత్తు కోసం లక్షలు అప్పులు చేసి విదేశాలకు పంపితే వారు చదువులు ఆపి అర్థాంతరంగా ఇంటిపట్టున ఉండటంతో తల్లిదండ్రుల వ్యధ చెప్పనలవికాదు. ప్రభుత్వం వీటిపై కమిటీ వేసి వీరి అభ్యాసన సామర్థ్యాలకు తగ్గట్టు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ ఇచ్చి మెడికల్ ప్రాక్టీషనర్లుగా గుర్తించాలి. ఆర్ఎంపి, పిఎంపిలను ప్రాక్టీషనర్లుగా గుర్తిస్తున్న ప్రభుత్వం వీరి సేవలు వినియోగించుకోవాలి.

బ్రిటిష్ పాలనలోనే చేనేత ఉద్యమ నిర్మాణం

కట్టా హేమ సుందరరావు

సామ్రాజ్యవాదుల కబంధహస్తాల్లో నలిగిపోతున్న ఆ కాలంలో ఏదైనా ఒక సంఘం స్థాపించాలంటే అనేక అవస్థలు పడవలసి వచ్చేది. ఆచార్య రంగా సహచరుడుగా పోరాట పటిమ సంతరించుకున్న పుచ్చల సత్యనారాయణకి వ్యవసాయం తర్వాత దేశంలోనే పెద్ద పరిశ్రమ అయిన చేనేత పరిశ్రమను సంఘటితం చేయడానికి పూనుకొమ్మని 1933లో ఆచార్య రంగా నుండి ఉత్తరం వచ్చింది. చేనేత కార్మికుల కష్టాల్లో, బాధల్లో పాలు పంచుకొమ్మని, వారి అభివృద్ధికి కృషి చేయమని ఆ లేఖలో సత్యనారాయణను రంగా కోరారు. ఆ లేఖ అందుకున్న పుచ్చల సత్యనారాయణ ఇందుకు రంగా సహాయం అవసరమని, అన్ని రాష్ట్రాల్లో వున్న చేనేత పారిశ్రామికుల స్థితిగతుల్ని అధ్యయనం చేయడానికి వెళతానని తెలియజేస్తూ తిరిగి జాబు రాశారు. ఈ సందర్భంగా పుచ్చల చాలా రాష్ట్రాలు తిరిగి అక్కడి సమస్యల్ని తెలుసుకున్నారు. ఆనాడు ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించిన పుచ్చల చేనేత సంఘం ఏర్పాటు చేయ డానికి నిర్ణయించారు. ఈ చేనేత కార్మిక సంఘం భారతదేశంలో మొట్టమొదటి చేనేత కార్మిక సంఘం. బ్రిటిష్ పరిపాలనలో భారతీయులు పాల్గొనే అడ్వయిజరీ కౌన్సిల్ వుంది. అందులో ఆచార్య రంగా సభ్యులుగా వున్నారు. వీరికి ఈ సమస్యలు వివరిస్తూ చేనేత సంఘ స్థాపనపై ఎలాంటి అవగాహన ఆనాడు లేదు గనుక వీటి చట్టాల రూపురేఖలు కూడా ఎవరికీ తెలియని పరిస్థితిలో మనం ఈ సంఘం ఏర్పాటు చేస్తున్నాం. చేనేత పారిశ్రామికులు ఉన్న ప్రాంతంలో సమస్యలు మనం అర్థం చేసుకున్నాం. కాని చట్టపరంగా దీనికి ఏ పరిష్కారం లభిస్తుందో అధ్యయనం చేయవలసిన అవసరం వుందని చెప్పారు. ఇందుకుగాను చేనేత పరిశ్రమపై ఉన్నతాధికారుల్ని సంప్రదించి వారి సలహాల్ని కూడా తీసుకోవాలని సత్యనారాయణ తెలియజేశారు. ఇందుకు అవసరమైన సమాచారాన్ని సేకరించండని రంగా సత్యనారాయణను ఆదేశించారు. వివిధ ప్రాంతాల్లో వున్న చేనేత పెద్దల్ని కలుసుకుంటూ మద్రాసులో వున్న హ్యాండ్లూం కాలేజీ ప్రిన్సిపాల్ మాన్‌సట్‌ను పుచ్చల కలిశారు (మాన్‌సట్ టెక్స్‌టైల్ రంగం మీద మాంచెస్టర్‌లో విద్య నభ్యసించారు). చేనేత కార్మిక సంఘం నిర్మాణం సాంకేతికంగా చేయవలసిన పనులను గురించి మాన్‌సట్ సలహాల్ని కోరారు. అప్పటికి పవర్‌లూమ్స్ లేవు. చేనేత మిల్లుబట్ట నుండి పోటీని ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో చేనేతకు చట్టపరమైన రక్షణ కావాలని, అందుకు పోరాటం చేయండని, ఇందుకు చీరలు, దోవతులు చేనేతకు రిజర్వేషన్ చేయాలంటూ ప్రభుత్వానికి డిమాండ్ పెట్టాలని మాన్‌సట్ సలహానిచ్చారు. ఈ నినాదం ఆధారంగా పుచ్చల సత్యనారాయణ ప్రణాళిక రూపొందించి 1937వ సంవత్సరంలో నెల్లూరు నుండి శ్రీకాకుళం వరకు చేనేత పరిశ్రమ ఉన్న ప్రాంతాల్లో ప్రచారం చేస్తూ ఉద్యమ రూపం తీసుకు వచ్చారు. ఈ సందర్భంలోనే ఆచార్య రంగా గుంటూరు జిల్లా నిడుబ్రోలులో

పుచ్చల సత్యనారాయణ

రైతాంగ విద్యాలయం రైతు శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో కొన్ని తరగతులు బోధించేందుకు పుచ్చల సత్యనారాయణను పిలిచారు. ఆ క్లాసులో సత్యనారాయణ రైతులకు చేనేత కార్మికులకు దగ్గర సంబంధం వున్నదని, ప్రత్తిరైతు పచ్చగా వుండి ప్రత్తికి గిట్టుబాటు ధర పలికితేనే చేనేత కార్మికులకు నూలు ధర అందుబాటులో వుంటుందని తెలియజేస్తూ రైతులకు, చేనేత కార్మికులకు మధ్య అవినాభావ సంబంధాన్ని పెంపొందించేందుకు, మధ్య దళారులను తొలగించేందుకు సహకార రంగంలో నూలు మిల్లులు స్థాపిస్తే బాగుంటుందని తెలియజేసే వారు. వాటితోపాటు సోషలిజం కూడా బోధించేవారు. పారిశ్రామికీకరణ వేగంగా అభివృద్ధి చెందినా, సోషలిజం సిద్ధించినా చేనేత కార్మికులకు ఉపాధి కలిగేంత వరకు ఈ పరిశ్రమకు చట్టబద్ధ రక్షణ అవసరం ఉందని తెలియజేశారు. ఈ రైతాంగ విశ్వవిద్యాలయానికి హాజరైన వారిలో చేనేత కుటుంబం నుండి వచ్చిన ప్రగడ కోటయ్య పుచ్చల సత్యనారాయణ దృష్టిని ఆకర్షించారు. ఆచార్య రంగాతో కోటయ్యని చేనేత ఉద్యమంలోకి పంపేందుకు శిక్షణనివ్వాలని, టెక్స్‌టైల్ టెక్నాలజీ కళాశాలకు పంపి చేనేత పరిశ్రమ రక్షణ గూర్చి అధ్యయనం చేయించాలని రంగాను సత్యనారాయణ కోరారు. రంగా ప్రగడ కోటయ్యని, వారి తల్లిదండ్రుల్ని పిలిచి విషయం చెప్పి టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో చేర్పించారు. 1942లో బ్రిటిష్ ప్రభుత్వం ఫార్ట్ ఫైండింగ్ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్ అయిన బ్రిటిషు ఆర్థికవేత్త థామస్ బృందం తూర్పు గోదావరి జిల్లా ఉప్పాడకు వచ్చి పుచ్చల సత్యనారాయణను కలిసింది. వీరు చేనేత పరిశ్రమ మరెంతోకాలం నిలవ లేదని, వేగవంతమయిన మిల్లు వస్త్రాల పోటీని ఇవి తట్టుకోలేవని వీటిమీద సమగ్రమైన సమాచారాన్ని సేకరిస్తున్నామని, చేనేత పరిశ్రమకు ప్రత్యామ్నాయం సూచించమని సత్యనారాయణను కోరారు. "అభివృద్ధి క్రమం ఎంత జరిగినా ఈ దేశానికి స్వరాజ్యం వచ్చిన తరవాత ఈ చేనేత పరిశ్రమ ఉండకపోవచ్చు, అభివృద్ధిపథంలో సాగుతున్నప్పుడు చేతివృత్తులు అంతరించిపోవచ్చు. ఈ వృత్తినే పట్టుకొని మేము వేలాడం, శాశ్వతంగా చేనేతనే ఉంచాలని కోరం. కానీ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు చేనేత ఎంతకాలం అవసరమో అంతవరకు ఉండాలని, ఈ పరిశ్రమ మీరు అనుకున్నంత తేలికగా అంతరించిపోయేది కాదని, అంతమాత్రం చేత ప్రభుత్వ సహాయం మాకు అవసరం లేదు అని కాదని, ఈ పరిశ్రమ రక్షణకు ప్రభుత్వం పూనుకోవలసిన అవసరం వుందని, ఈ అవసరాన్ని గుర్తింపచేసే బాధ్యత మీ కమిటీపై వుందని" సత్యనారాయణ చెప్పారు. ఉప్పాడలో జరిగిన చేనేత మహాసభ డాక్యుమెంట్లు, చీరలు, దోవతులు చేనేతకే కేటాయించాలని చేసిన తీర్మానాలను వారికి అందచేశారు.

మహోపాధ్యాయుడు పుచ్చల

పుచ్చల సత్యనారాయణ జీవితం మహోద్యమాల గని. దీన్ని తవ్వితే ఒక మహోపాధ్యాయుడుగాను, ఒక తత్వవేత్తగాను, ఒక శాసనసభ్యుడుగాను, ఒక సామాన్య గుమాస్తాగాను, ఒక ఉన్నత కుటుంబీకుడుగాను, ఒక స్వాతంత్ర్య సమరయోధుడుగాను, శాంతిమూర్తిగాను, మరెన్నో రకాలుగా వీరి జీవితం మనకు కనిపిస్తుంది. తూర్పు గోదావరి జిల్లా ఉప్పాడ గ్రామంలో ఉన్నత కుటుంబంలో పుచ్చల జన్మించారు. తల్లిదండ్రులు రామలింగం, పార్వతి నుండి స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని సత్యనారాయణ పుణికి పుచ్చుకున్నారు. శాంతిగుణం, సంఘ సంస్కరణ భావాలు వారి నుండే అలవర్చుకున్నారు. పుచ్చల తల్లిదండ్రులు గొప్ప గాంధేయవాదులు. వీరు నిర్వహించిన సంస్కరణ వివాహం కారణంగా అనాడు చాందస భావాలు కలిగిన వారి నుండి అనేక అవమానాలు ఎదుర్కొన్నారు. సంఘ బహిష్కరణకు గురయ్యారు. ఉప్పాడలో వీరికి మంచినీటి బావి వుండేది. ఆ గ్రామస్తులు వీరిని సంఘ బహిష్కరణ చేయడంతో ఆ బావిలోని మంచినీరు ఊరి ప్రజలు తీసుకు వెళ్ళకుండా చాందసులు ఆ బావిచుట్టూ మలవిసర్జన చేసేవారు. ఉదయం లేచి చూసేసరికి వీరికి ఆ దృశ్యం కనిపించేది. వెంటనే రామలింగం పారపట్టి శుభ్రం చేసేవారు. అలాగే అనేక రోజులు జరిగినా విసుగు లేకుండా చేయడమేగాక, మలవిసర్జన చేసేవారిని క్షమాభావంతో చూసి ఏమీ అనేవారు కాదు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఆనాటి కాంగ్రెస్ ఉద్యమాన్ని వదల్లేదు. తమ ఆస్తుల్ని సైతం ఆ ఉద్యమానికి అర్పించారు. ఉన్నత కుటుంబం అనే గర్వం వారికి లేదు సరికదా అత్యంత సాధారణ జీవితం సైతం వారు అనుభవించారు. సత్యనారాయణ కమ్యూనిస్టు ఉద్యమం కోసం, చేనేత ఉద్యమంకోసం తమ ఆస్తులు సమర్పించడమేకాక అప్పులు కూడా చేశారు.

(నేడు చేనేత దినోత్సవం)

ఉద్రిక్తత మంటల్లో ఆజ్యం పోస్తున్న అగ్రరాజ్యం

అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ తైవాన్ పర్యటన ఆసియాలో ఉద్రిక్తత పెంచే చర్య. ఉద్దేశపూర్వకంగా చేపట్టిన విహార యాత్ర లాంటి వివాద యాత్ర. చైనాని రెచ్చగొట్టడమే ఈ యాత్ర ఉద్దేశం తప్పించి తైవాన్‌కి ఏదో మేలు చేద్దామన్న తలంపు కాదు. ఎందుకంటే తైవాన్‌ని స్వతంత్ర దేశంగా అమెరికా గానీ, ఐక్యరాజ్య సమితి గానీ గుర్తించలేదు. భారత్‌తో సహా ప్రపంచ దేశాలన్నీ (పదమూడు చిన్న దేశాలు మినహా) దాన్ని చైనాలో అంతర్భాగంగానే గుర్తిస్తున్నాయి. వాణిజ్య సంబంధాలున్నప్పటికీ దౌత్య సంబంధాలు లేవు. చైనా కూడా దాన్ని బలవంతంగా కలుపుకొనే పరిస్థితి లేదు. అలా బలవంతంగా కలుపుకుంటే ఒప్పుకునేది లేదన్నది అమెరికా మాట. ఈ మధ్య కాలంలో తైవాన్‌కి చైనాకి నడుమ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. తైవాన్ పట్ల అమెరికా అత్యుత్సాహం చూపడం చైనాకి సహజంగానే ఇష్టం లేదు. ఇప్పుడెంత వారిస్తున్నా పెలోసీ అక్కడ పర్యటించడం చైనాని కవ్వించడమే అయ్యింది. బదులుగా చైనా తైవాన్ నుండి దిగుమతుల్ని అడ్డుకోవడమే కాకుండా ఆ ద్వీప దేశం చుట్టూ బలప్రదర్శన చేస్తోంది. ఇప్పటికే రష్యా, ఉక్రెయిన్ యుద్ధంతో ప్రపంచం ఎంతో

నష్టపోయింది. ఇంధనం, ఆహార పదార్థాల ధరలు మండిపోతున్నాయి. ఇప్పుడీ కొత్త ఉద్రిక్తతతో సెమి కండక్టర్లు, కంప్యూటర్ విభాగాల ధరలు కూడా పెరిగిపోతాయి. ఎందుకంటే ఆ దేశం వీటి తయారీలో, ఎగుమతుల్లో అగ్రభాగాన ఉంది. యుద్ధ మేఘాలు మరింత ముదిరితే మరింత నష్టం ఖాయం. చైనా తైవాన్‌ని ఎట్టి పరిస్థితిలోనూ చేజార్చుకోదు. అమెరికా దానికి ప్రత్యక్షంగా ఏ సాయమూ చెయ్యలేదు. ఎటూ తెగని వివాదాలివి. ప్రపంచ దేశాలు ఇప్పటికే ఆర్థిక మాంద్యంతో ఇబ్బంది పడుతుండగా అగ్రరాజ్యాలు బాధ్యతారహితంగా ప్రవర్తించి చలి కాసుకోవడమే నేటి విషాదం.

– డా. డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ, 9440836931.

'నేను' అంటే ఎవరు?



డాక్టర్ దేవరాజు మహారాజు

ఏళ్లకేళ్లుగా జీవాత్మ-పరమాత్మ అంటూనో, అహం బ్రహ్మాస్మి అంటూనో ఆధ్యాత్మిక, ధార్మిక తాత్విక ప్రముఖులు ఇచ్చే వివరాలు వింటూ కాలం గడిపేశాం. మానవుణ్ణి సన్మార్గంలో పెట్టడానికి అవి కొన్ని శతాబ్దాల పాటు ఉపయోగపడ్డాయి. నిజమే! కాని, అవి నిజ నిర్ధారణకు నిలబడేవి కావు. కేవలం నమ్మకాలు, విశ్వాసాల ఆధారంగా మానవ సమాజాన్ని ప్రభావితం చేశాయి. నేలకొరుగుతున్న తీగను నిలబెట్టడానికి పందిరి వేయాల్సి ఉంటుంది. విశ్వాసాలు పందిరి లాంటివి. ఇప్పుడు మనకు ఉన్న విజ్ఞానం, శాస్త్ర పరిజ్ఞానం తీగ దశలో లేదు. మహా వృక్షంగా మారిపోయింది. దాన్ని నిలబెట్టడానికి ఏ పందిరి గుంజా అక్కర లేదు. దాన్ని అలా స్వతంత్రంగా స్వేచ్ఛగా, ఏపుగా ఎదగనివ్వాలి. వర్థిల్లనివ్వాలి. విశ్వాసాల నీడలో, అభద్రతా భావంతో ఇంకా ఇంకా బితుకుబితుకుమంటూ బతకగూడదు. వాస్తవాల్ని అర్థం చేసుకుని, ఆత్మ విశ్వాసంతో మనగలగాలి.

"నువ్వు నీచుడివి, నికృష్టుడివి, జన్మరాహిత్యం కోసం ఫలానా దేవుణ్ణి నమ్ము, ఫలానా మతంలో చేరు"- అని చెపుతాడు ఏ మత పెద్దయినా. అదంతా వారు, వారి మనుగడ కోసం పడుతున్న తాపత్రయం అని మనం అర్థం చేసుకోవాలి! "మీరు నమ్మండి. ఫలితం కనిపిస్తుంది" అని అంటారు వాళ్లు. "ఫలితం కనిపిస్తే నమ్ముతాం" అని అందాం మనం. చీమగా, దోమగా, కుక్కగా, గాడిదగా పుట్టి, పుణ్యం చేసుకున్నందువల్ల, మనిషి మనిషిగా పుట్టాడని చెపుతారు వాళ్లు. అంటే సృష్టిలో మనిషి ఉన్న ఫళాన ఊడిపడలేదని, కాలక్రమంగా పరిణామ దశల్లో జంతు రూపాల దశలు దాటి, చివరికి మనిషి- మనిషి రూపు సంతరించుకున్నాడని చెప్పే ప్రయత్నమే అది కాబోలని.. మనం అనుకోవచ్చు! అయితే ఆ అభిప్రాయం జనంలో అసమగ్రంగా, అమాయకంగా, అజ్ఞానంగా ఇంకిపోవడం వల్ల, రూపాంతరం చెందడం వల్ల అది చాదస్తంగానూ మతమౌఢ్యం గానూ మిగిలిపోయింది.

మానవజన్మ ఉత్కృష్టమైంది. నిజమే! జీవ పరిణామ క్రమంలో 'జీవి' మారుతూ, మారుతూ ఒక ఉచ్ఛ స్థితికి చేరుకుంది. అదే మానవుడు! అందువల్ల మానవుడే జీవరాసులన్నింటిలోకి తెలివైనవాడు. అలాగే ప్రకృతిలో అత్యంత విలువైన ప్రాణి మానవుడే! ఎందుకంటే మనిషి తన చుట్టూ ఉన్న ప్రకృతిని అర్థం చేసుకున్నాడు. ప్రకృతిలోని వృక్ష జంతు సముదాయాన్ని అర్థం చేసుకున్నాడు. కొన్నిటిని పెంచుకున్నాడు. కొన్నిటిని మచ్చిక చేసుకున్నాడు. తన జీవితం సుఖమయం కావడానికి కావాల్సిన అన్ని వస్తువుల్ని వాటి నుంచి సంగ్రహించాడు. అలాగే తనని తాను తెలుసుకునే ప్రయత్నం చేశాడు. ఇంకా చేస్తూనే ఉన్నాడు. ఈ భూమండలం మీద మరో జీవి ఇలాంటి ప్రయత్నాలు చేసిన దాఖలాలు లేవు.

'నేనంటే ఎవరు?' అనే ప్రశ్న మనిషి మెదడులో అనాదిగా ఉంటూనే ఉంది. ప్రగతి పథంలో ముందుకు వస్తున్న కొద్దీ ఆ ప్రశ్నకు నిర్వచనం మారుతూ ఉంది. ఒకప్పటి అనాగరికుల ఆటవికుల నిర్వచనానికీ, నాగరికుల నిర్వచనానికి తేడా ఉంది. కళ్లూ, ముక్కూ మూసుకుని ఆత్మల లోకంలో విహరించే రుషులిచ్చిన నిర్వచనానికీ, ఆధునికుడిచ్చే నిర్వచనానికి తేడా ఉంది. ఈ 21వ శతాబ్దపు అత్యాధునికుడికి అవేవీ సంతృప్తినివ్వవు. అసమంజసంగా, అసమగ్రంగా కూడా అనిపిస్తాయి. అయితే ఇక్కడ కొంతమంది అత్యాధునికులు అతి పురాతన నిర్వచనాల్ని నెత్తిన పెట్టుకుని మోస్తుంటారు. ఈ కాలానికి అనుగుణంగా ఈ కాలపు పరిజ్ఞానంతో ఇప్పటి వైజ్ఞానికులిచ్చే నిర్వచనాన్ని వాళ్లు పట్టించుకోరు. అన్ని ఆధునిక వసతులు ఉపయోగించుకుంటూ, ఎప్పుడో వేల ఏళ్ల నాటి మనిషి ఏర్పరుచుకున్న అభిప్రాయాల్ని, నిర్వచనాల్ని- సంస్కృతి, సంప్రదాయాల పేరుతో నిలబెట్టాలని చూస్తుంటారు. అత్యధిక సంఖ్యలో ఉన్న అలాంటి 'వెనక చూపు' మనుషులకు 'ముందుచూపు' నేర్పించే ప్రయత్నమే ఈ 'నేనంటే ఎవరు?' అనే పుస్తకం! వాస్తవాల్ని జీర్ణించుకోలేని వారు ఈ పుస్తకం చదవకపోవడమే మంచిది. ఎందుకంటే ఈ 'నేనంటే ఎవరు?' అనే పుస్తకం ఈ విశాల విశ్వంలో మనిషి అనేవాడు ఎవరో అర్థం చేయించే ప్రయత్నం చేస్తుంది. ఏమో..భవిష్యత్తులో ఈ సమాచారం పాతదై పోవచ్చు.. అందుకు కూడా మనం సిద్ధపడే ఉండాల్సి ఉంటుంది!

మనలో దాగి ఉన్న.. 'నేను' అనే భావం- అంటే 'అహం' ఏమిటి? అది ఎలా ఉంటుంది? అది మనలో దాగి ఉన్న మరొకరా? లేక మనమేనా? ఈ విషయం మనిషిని చాలా కాలంగా కలవరపెడుతోంది. మనిషి నిరంతరం దాని కోసం అన్వేషిస్తూనే ఉన్నాడు. అంతే ఇప్పటి వరకు మనిషి తనను తాను ఎంతవరకు అన్వేషించుకున్నాడు? సమాధానాలు ఎంతవరకు సంపాదించుకోగలిగాడు? ఎప్పటికప్పుడు బేరీజు వేసుకోవాల్సిన అంశం. జీవశాస్త్ర పరంగా ఈ 'నేను' అనే దానికి సమాధానం వెతుక్కోవాలి. కొత్త నిర్వచనానికి రూపకల్పన చేయాలి. అలాగే ఇన్ని దేశాలలో, ఇన్ని జాతులలో, ఇన్ని వర్గాలతో ఉన్న మానవ సమాజంలోంచి ఈ 'నేను' ఎలా ఉద్భవించాడు? అలాగే నేను తినేదాన్ని బట్టి నా జీవన ప్రక్రియలుంటాయి. ఆ జీవన ప్రక్రియల్ని బట్టి నా ప్రవర్తన, మనస్తత్వం రూపొందుతుంది. వాటికి అనుగుణంగానే, ఈ సమాజంలో ఈ 'నేను' కు ఒక వ్యక్తిత్వం ఏర్పడుతుంది. కొన్ని ముఖ్యమైన కోణాల నుండి 'నేను' ను విశ్లేషించే ప్రయత్నం ఈ పుస్తకంలో జరిగింది. సరదాగా కుటుంబంలో జరిగే సంభాషణల ద్వారా విషయం సీరియస్‌గా చర్చించడం ఉంది. 'ఆత్మ పరమాత్మలో కలవాలి'- అని ఆధ్యాత్మిక గురువులు చెప్పే శుష్క ప్రవచనాల్ని నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టి, మనిషికి, అతని ఆత్మ విశ్వాసానికి, అంతర్ చైతన్యానికి ఇక ప్రాధాన్యమివ్వక తప్పదని ఈ రచన స్పష్టం చేస్తుంది.

ఏకకణ జీవి నుండి మానవుడి దాకా ఉన్న సుదీర్ఘ జీవ పరిణామ క్రమంలో ఎన్నో సంక్లిష్టతల్ని సంతరించుకుంటూ, మనిషి- అంటే ఈ నేను అనేవాడు ఉద్భవించాడు. వీడు అటు ఊహించుకున్న దేవుడు కానక్కరలేదు. ఇటు కల్పించుకున్న దయ్యమూ కానక్కరలేదు. మనిషి మనిషిగా హుందాగా ఈ సృష్టిలో తను



అత్యంత విలువైన ప్రాణినని, విలువల్ని నిలబెట్టగలిగే ప్రాణినని.. తనను తానే నిలబెట్టుకోగల సర్వ సామర్థ్యాలు గల వాడినని.. అచంచలమైన ఆత్మ విశ్వాసంతో మనుగడ సాగించాల్సి ఉంది. ఇంకా చంకల కింద విశ్వాసాల కర్రలు దోపుకుని, అవిటివాడి వలె బతకాల్సిన పనిలేదు. సుఖాన్ని సుఖంగానూ, దుఃఖాన్ని దుఃఖంగానూ, మరణాన్ని మరణంగానూ స్వీకరించగలిగే చేవ గల సర్వ స్వతంత్రుడు కావాలి. ఈ జీవితాన్ని తాను నియంత్రించుకోగల మేధావి, దార్శనికుడు, క్రాంతికారుడు మనిషి! తనను తాను తెలుసుకోవడమంటే ఆధ్యాత్మిక పరంగా పలాయనం చిత్తగించడం కాదు. జీవశాస్త్ర పరంగా, సామాజిక పరంగా, ఆర్థికపరంగా, ఆహార పరంగా, విహారపరంగా, పర్యావరణ పరంగా వాస్తవాల్ని వాస్తవాలుగా తెలుసుకోవడం మాత్రమే! ఆ ప్రయత్నంలో కొందరు అడుగులు ముందుకు వేశారు. ఇక మనందరం వారిని అనుసరించాల్సి ఉంది. సెప్టెంబర్ 2018లో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ వారు ప్రచురించిన "నేను" అంటే ఎవరు?- ఒక వైజ్ఞానిక వివరణ'- అనే పుస్తకానికి సంబంధించిన పరిచయం ఇది. 30 డిసెంబరు 2021 గురువారం ఉదయం ఈ పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడెమి వారు బాల సాహిత్య పురస్కారం ప్రకటించారని టీవి వార్తల్లో తెలుసుకున్న నా మిత్రులు, తోటి రచయితలు, ప్రముఖులు, శ్రేయోభిలాషులు, సామాన్యులు ఎంత సంతోషించారో వారి మాటల్లో పొంగిపొర్లిన ఉల్లాసం తెలియజెప్పింది. వారందరికీ సోషల్ మీడియా ద్వారా నా ధన్యవాదాలు తెలియజేశాను.

వ్యాస రచయిత కేంద్ర సాహిత్య అకాడెమీ విజేత,
జీవశాస్త్రవేత్త

విశాలాంధ్ర
5
ఆదివారం
07 ఆగస్టు 2022

సంపన్నుల రుణమాఫీకి కృతజ్ఞతలా?

పాలకులకు ఎంపీ వరుణ్‌గాంధీ ప్రశ్న



న్యూఢిల్లీ: ప్రధాని మోదీ 'ముఫ్త్ కి రేవ్‌డీ' (ఉచితాల) వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ వరుణ్‌గాంధీ శనివారం తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. ఐదేళ్లలో అవినీతి వ్యాపారవేత్తలకు రూ.10లక్షల కోట్ల రుణమాఫీ లభించిందని విమర్శించారు. మెహుల్ చోక్సీ, రిషి అగర్వాల్ వంటి వారు 'ముఫ్త్ కి రేవ్‌డీ' జాబితాలో అగ్రస్థానంలో ఉన్నారని వరుణ్‌గాంధీ హిందీలో ట్వీట్ చేశారు. పది ఎగవేత సంస్థల గురించి పార్లమెంటులో ప్రభుత్వం ఇచ్చిన సమాధానాన్ని ఆయన ప్రస్తావించారు. 'పేదలకు 5కేజీల రేషన్ ఉచితంగా ఇచ్చినందుకు కృతజ్ఞతను ఆశిస్తున్న ఈ పార్లమెంటు..ఐదేళ్లలో అవినీతి వ్యాపారవేత్తల రూ.10లక్షల కోట్ల రుణాన్ని మాఫీ చేసినట్లు చెబుతోంది. ప్రభుత్వ ఖజానా/నిధులపై మొదటి హక్కు ఎవరిది' అని వరుణ్ గాంధీ ప్రశ్నించారు. కోవిడ్ కాలం, ఇందుకు కృతజ్ఞతలు తెలపాలని పార్లమెంటులో బీజేపీ ఎంపీ చేసిన వ్యాఖ్యలకు వరుణ్ స్పందించారు. యూపీలో ఎక్స్‌ప్రెస్ వే ప్రారంభం సందర్భంగా మోదీ మాట్లాడుతూ కొన్ని రాజకీయ పార్టీలు 'ముఫ్త్ కా రేవ్‌డీ' (ఉచితాలు) ఆశచూపి ఓట్లు కోరుతున్నాయని, ఇది దేశానికి చాలా ప్రమాదకరమని వ్యాఖ్యానించిన విషయం విదితమే. రేవ్‌డీ అన్నది ఒకరకమైన మిఠాయి. దీనిని ఉచితాలనుద్దేశించి వినియోగిస్తుంటారు.

భార్యలు గెలిస్తే.. భర్తల ప్రమాణస్వీకారం

భోపాల్: సాధారణంగా గ్రామాల్లో పంచాయతీ సభ్యులుగా మహిళలు గెలిస్తే వారి స్థానంలో భర్తలు విధులు నిర్వహించడం, అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం వంటివి తరచూ చూస్తేనే ఉంటాం. కానీ, ఈ పంచాయతీ ఎన్నికల్లో మహిళలు గెలిచినా.. వారి భర్తలు లేదా తండ్రులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ విడ్డూరం మధ్యప్రదేశ్‌లోని కొన్ని గ్రామాల్లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మధ్యప్రదేశ్‌లో ఇటీవల పంచాయతీ ఎన్నికలు జరిగాయి. గెలిచిన వారు ప్రమాణస్వీకారం చేశారు. అయితే సాగర్, దమోహ్ జిల్లాల్లోని కొన్ని గ్రామాల్లో గెలిచిన మహిళల స్థానంలో వారి కుటుంబంలోని మగ బంధువులు ప్రమాణం చేయడం స్థానికంగా వివాదాస్పదంగా మారింది. జైసినగర్ గ్రామంలో 10 మంది మహిళలు పంచాయతీ సభ్యులుగా ఎన్నికవ్వగా.. ఓ మహిళ స్థానంలో ఆమె తండ్రి ప్రమాణం చేశారు. మరో ఇద్దరు మహిళల భర్తలు, మరో మహిళ బావ ప్రమాణస్వీకారం చేశారు. దామోహ్ జిల్లాలోని గైసాబాద్, పిపారియా కిరౌ గ్రామాల్లోనూ ఇలాంటి ఘటనలే జరిగాయి. ఇందుకు సంబంధించి దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో ఈ వ్యవహారం బయటికొచ్చింది. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవడంతో సాగర్ జిల్లా పంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విచారణకు ఆదేశించారు.

జైసినగర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ ఆశారాం సాహూను విధుల నుంచి సస్పెండ్ చేశారు. అయితే దీనిపై సాహూ మాట్లాడుతూ.. 'పంచాయతీ సభ్యులుగా గెలిచిన మహిళలను ప్రమాణస్వీకారానికి రమ్మని ఎన్నిసార్లు పిలిచినా వారు రాలేదు. వారికి బదులుగా తమ బంధువులను పంపించారు. దీంతో చేసేదేం లేక, వారితోనే ప్రమాణం చేయించాం' అని చెప్పడం గమనార్హం.

క్రైస్తవ సంస్థలపై దాడులకూ వర్తిస్తాయా? సుప్రీం

న్యూఢిల్లీ: విద్వేష నేరాల నియంత్రణకు సుప్రీంకోర్టు ఆదేశాలతో రూపొందించిన సమగ్ర మార్గదర్శకాలు క్రైస్తవ సంస్థలపై దాడులకు కూడా వర్తిస్తాయా అని కేంద్ర ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. కొన్నేళ్లుగా క్రైస్తవ సంస్థలపై దాడులు ఎక్కువయ్యాయంటూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ మేరకు ప్రశ్నించింది. ఈ పిల్‌ను బెంగళూరు ఆర్చ్ బిషప్ పీటర్ మచడో దాఖలు చేశారు. నేషనల్ సాలిడారిటీ ఫోరం, ఎవాంజెలికల్ ఫెలోషిప్ ఆఫ్ ఇండియాలతో కలిసి ఉమ్మడిగా దాఖలు చేశారు. క్రైస్తవ సంస్థలపై దాడుల నియంత్రణ, భద్రత చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన బెంచ్ ఈ మేరకు కేంద్ర, రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ న్యాయవాది కాను అగర్వాల్ అడ్డుతగిలారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినకుండా నోటీసులు జారీ చేయవద్దని ఆయన కోరారు. కొద్ది సేపటి తర్వాత తుషార్ మెహతా వర్చువల్‌గా కోర్టుకు హాజరయ్యారు. దాఖలైన పిల్‌కు సంబంధించిన సమాచారాన్ని కేంద్రం సమర్పిస్తుందని చెప్పారు. 2018లో సుప్రీంకోర్టు ఆదేశాలతో రూపొందించిన సమగ్ర మార్గదర్శకాలు ప్రస్తుత కేసుకు వర్తిస్తాయా లేదా అని చెప్పాలని పేర్కొంది.

ఆర్‌సీపీ సింగ్‌కు నితీశ్ షాక్

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఒకప్పటి తన మాజీ సహచరుడైన ఆర్‌సీపీ సింగ్‌కు షాక్ ఇచ్చారు. పార్టీ మాజీ జాతీయ అధ్యక్షుడుగా ఆర్‌సీపీ సింగ్ పనిచేశారు. తొమ్మిదేళ్లలో సంపాదించిన ఆస్తుల వివరాలపై సమాధానం ఇవ్వాలని కోరుతూ అధికార జనతా దళ్ యునైటెడ్ (జేడీయూ) తాజాగా ఆయనకు ఒక లేఖ రాసింది. సింగ్ సంపాదించిన ఆస్తుల్లో అనేక అవకతవకలు జరగడం తమ దృష్టికి వచ్చిందని ఆ లేఖలో జేడీయూ పేర్కొంది. సింగ్ భవిష్యత్ ముఖ్యమంత్రి అంటూ నినాదాలతో కూడిన ఒక వీడియో వారం రోజుల క్రితం వెలుగుచూసిన నేపథ్యంలో జేడీయూ ఈ లేఖ రాయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా, తనకు జేడీయూ పంపిన లేఖపై ఆర్‌సీపీ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 2010 నుంచి తన భార్య, కుమార్తె పన్నులు చెల్లిస్తున్నారని, అవి వాళ్లు కొనుగోలు చేసిన ఆస్తులని చెప్పారు. మాజీ ఐఏఎస్ అధికారి కూడా అయిన ఆర్‌సీపీ సింగ్‌ను గత జూన్‌లో పాట్నా వీఐపీ జోన్‌లోని సువిశాల భవంతి నుంచి ఖాళీ చేయించారు. నితీశ్‌కు ఒకప్పుడు అత్యంత విశ్వసనీయుడుగా ఆర్‌సీపీ సింగ్‌కు పేరుంది. అయితే ఇటీవల ఆయనకు మరో విడత రాజ్యసభ టికెట్ ఇచ్చేందుకు జేడీయూ నిరాకరించింది. దీంతో ఆయన కేంద్రమంత్రి పదవి నుంచి దిగిపోయారు. ముఖ్యమంత్రి అనుమతి లేకుండానే ఆయన కేబినెట్ పదవిని అంగీకరించడంపై జేడీయూ కన్నెర్ర చేసిందని, అందుకే మరో విడత రాజ్యసభ టికెట్ ఇచ్చేందుకు నిరాకరించిందని సమాచారం. కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం ఆర్‌సీపీ సింగ్ నలందా జిల్లాలోని తన స్వగ్రామంలోనే ఉంటున్నారు. చుట్టుపక్కల జిల్లాల్లో పర్యటిస్తూ తనకంటూ సొంత బలం ఏర్పాటు చేసుకునే ప్రయత్నాలు సాగిస్తున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో మూక దాడి... కానిస్టేబుల్ వేడుకోలు

న్యూఢిల్లీ: సొసైటీకి రక్షణ నిలయంగా భావించే పోలీస్‌స్టేషన్‌లో.. అదీ అంతా చూస్తుండగానే ఓ పోలీస్ కానిస్టేబుల్‌పై నిర్దాక్షిణ్యంగా దాడి జరిగింది. పైగా ఆ దాడిని కొందరు వీడియోలు తీస్తుండగా.. తనను వదిలేయాలని ఆ సిబ్బంది చేతులెత్తి వేడుకోవడం వైరల్ అవుతోంది. దిగ్భ్రాంతికరమైన ఈ ఘటన న్యూఢిల్లీ ఆనంద్ విహార్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. సుమారు పది, పన్నెండు మంది చుట్టూ చేరి ఆ కానిస్టేబుల్‌ను విచక్షణ రహితంగా కొట్టారు. చుట్టుపక్కల చాలామంది ఆ ఘటనను వీడియో, ఫొటోలు తీశారు. అయితే ఎవరూ వాళ్లను ఆపే ప్రయత్నం చేయలేదు. బాధితుడు ఆ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్‌గా తెలుస్తోంది. క్షమించి వదిలేయాలని ఆ కానిస్టేబుల్ వేడుకోవడం వీడియోలో చూడొచ్చు. ఆగస్టు 3న ఈ ఘటన జరిగినట్లు సమాచారం. ఓ పోలీస్ సిబ్బంది వీడియో తీసి వైరల్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వీడియో ఉన్నతాధికారుల దాకా చేరడంతో విచారణకు ఆదేశించారు. కానిస్టేబుల్‌పై జరిగిన దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ అవుతోంది. అయితే కారణాలు ఏవైనా పోలీసులపై దాడి చేయడాన్ని కొందరు తీవ్రంగా తప్పుబడుతున్నారు. దాడి చేసిన వాళ్లను గుర్తించే పనిలో ఉన్నారు పోలీసులు. వీడియో వైరల్ అవుతుండడంతో నిందితులపై కఠిన చర్యలు ఉంటాయని చెబుతోంది ఢిల్లీ పోలీస్ విభాగం.

కొత్త మద్యం విధానంతో భారీ నష్టం

మాజీ లెఫ్టినెంట్ గవర్నర్‌ను నిందించిన ఆప్ ప్రభుత్వం

న్యూఢిల్లీ: ఢిల్లీ కొత్త మద్యం విధానం పై కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాల మధ్య వాగ్వాదం కొనసాగుతోంది. దేశ రాజధాని మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జీ) అనిల్ బైజాల్ తీసుకున్న నిర్ణయాల వల్ల ఖజానాకు నష్టం వాటిల్లిందని ఆరోపిస్తూ ఆయనపై సీబీఐ విచారణకు ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా శనివారం డిమాండ్ చేశారు. 'మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్ కొంతమంది మద్యం దుకాణాల యజమానులకు ప్రయోజనం చేకూర్చేందుకు యూ-టర్న్ తీసుకున్నారు. ఎల్‌జీ 48 గంటల ముందు ఆమోదించినట్లుగా తన స్వంత విధానాన్ని మార్చుకున్నారు. అతని నిర్ణయం కారణంగా, ప్రభుత్వానికి వేల కోట్లు నష్టం వాటిల్లింది. కొంతమంది దుకాణదారులకు ప్రయోజనం చేకూరింది. అనధికార ప్రాంతాల్లో మద్యం షాపులను తెరవడంపై మాజీ ఎల్జీ వైఖరిని మార్చుకోవడంపై విచారణ జరపాలని సీబీఐకి లేఖ రాశాను' అని సిసోడియా శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆప్ ప్రభుత్వం మద్యం పాలసీని అమలు చేయడంలో అవినీతి జరిగిందని ఆరోపించిన బీజేపీ పై ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి నిప్పులు చెరిగారు. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నియమించిన మాజీ ఎల్జీపై సిసోడియా విరుచుకుపడ్డారు. 'కొత్త మద్యం విధానం ప్రకారం, అనధికార ప్రాంతాలతో సహా ఢిల్లీ అంతటా 849 దుకాణాలను తెరవాల్సి ఉంది. ఎల్జీ ఈ ప్రతిపాదనకు అభ్యంతరం చెప్పలేదు. దానిని ఆమోదించింది' అని సిసోడియా చెప్పారు. ఢిల్లీ అభివృద్ధి మండలి, ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్న షరతును ప్రవేశపెట్టి, కొత్త మద్యం విధానం అమలుకు రెండు రోజుల ముందు ఎల్‌జీ తన వైఖరిని మార్చుకున్నారని చెప్పారు. మాజీ ఎల్‌జీ తన వైఖరిని మార్చుకున్నందున సుమారు 300 నుంచి 350 షాపులు తెరవలేకపోయాయని ఆయన పేర్కొన్నారు. నిర్ణయం మార్చుకోవడంపై సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తూ, ఎవరైనా ఎల్‌జీపై ఒత్తిడి తెచ్చారా అని సిసోడియా ప్రశ్నించారు. 'మాజీ ఎల్‌జీ ఒత్తిడితో ఈ నిర్ణయం తీసుకున్నారా, ఏ బీజేపీ నాయకుడికి దీనితో ఏదైనా సంబంధం ఉందా అనే దానిపై కూడా విచారణ జరగాలి' అని అన్నారు. అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం కొత్త మద్యం విధానం ప్రవేశపెట్టినప్పుడు బైజల్ ఢిల్లీ ఎల్‌జీగా ఉన్నారు. ఈ విధానం 2021 నవంబర్ 17న అమలులోకి వచ్చింది. అయితే ప్రభుత్వం ఇప్పుడు ఆ విధానాన్ని ఉపసంహరించుకుంది. సెప్టెంబర్ 1 నుంచి తన సంస్థల ద్వారా పాత మద్యం విధానం కింద మద్యం విక్రయాలను నిర్వహించడానికి సిద్ధమవుతోంది. ప్రస్తుతం నగరంలో ప్రైవేట్ మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న మద్యం విధానం ఆగస్టు 31తో ముగుస్తుంది. ఢిల్లీ ప్రభుత్వ కార్పొరేషన్లు సెప్టెంబర్ 1 నుంచి రిటైల్ మద్యం విక్రయాలను నిర్వహిస్తాయి. ఈ విధానంలో ప్రైవేటు వ్యక్తులు ఉండరు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా మంగళవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ (డీఓవీ) వంటి దర్యాప్తు సంస్థల ద్వారా ప్రభుత్వ అధికారులపై వచ్చిన అవినీతికి సంబంధించిన ఫిర్యాదులు లేదా కేసులపై దర్యాప్తులో విధానపరమైన లోపాలు, జాప్యాన్ని తీవ్రంగా పరిగణించారు. సంబంధిత పాలనా విభాగాలు తమ అధికారులపై ఫిర్యాదులలో దర్యాప్తు సంస్థలు కోరిన వ్యాఖ్యలను అందించకపోవడం లేదా ఆలస్యం చేయడంపై కూడా వి.సక్సేనా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ఒక అధికారిక ప్రకటన తెలిపింది.

ఉపా చట్టంతో అమాయకుల బలి

దీనిని రద్దు చేయాల్సిందే
సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్ డిమాండ్
విపక్షాల మూకుమ్మడి వ్యతిరేకత

న్యూఢిల్లీ: చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ-ఉపా) పేరుతో ప్రజాస్వామ్యవాదులపై మోదీ సర్కారు అక్రమంగా కేసులు నమోదు చేయించడం, అక్రమంగా ఏళ్ల తరబడి నిర్బంధంలో ఉంచుతున్న ఘటనలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. విపక్ష పార్టీలు సైతం కేంద్రంపై మండిపడుతున్నాయి. బ్రిటీష్ సామ్రాజ్యవాదులు సైతం ఇంతటి క్రూర చట్టాన్ని భారతీయులపై రుద్దలేదని విపక్ష నేతలు విమర్శిస్తున్నారు. న్యాయసూత్రాలను తలకిందులు చేస్తూ రూపొందించిన ఈ దారుణ, కిరాతక చట్టాన్ని రద్దు చేయాలని చాలాకాలంగా ప్రతిపక్షాలతో పాటు దేశంలోని ప్రజా సంఘాలు డిమాండు చేస్తున్న విషయం తెలిసిందే. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ఈ చట్టం కోరలు చాస్తోందనే విమర్శలున్నాయి. 2016 నుంచే ఉపా చట్టం కింద అత్యధిక కేసులు నమోదైనట్టు నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డులు వెల్లడిస్తున్నాయి. 2016 నుంచి 2019 నాటికి ఉపా చట్టం కింద 5,922 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నమోదైన ఈ కేసుల్లో కేవలం 132 మందిపైనే ఆరోపణలు నిజమైనట్టు తేలింది. అంటే నమోదవుతున్న కేసుల్లో 2 శాతం కూడా నిరూపితం కావడం లేదని తేలింది. వేల మందిపై నమోదైన కేసులన్నీ వేధింపులపర్వంలో భాగమేనని స్పష్టమవుతోంది. మరో సర్వే ప్రకారం పాలకుల తీరును విమర్శించిన పాపానికే 94 శాతం మంది ఉపా కేసులను ఎదుర్కొంటున్నట్టు తేలింది. ప్రస్తుతం దేశంలో ఆజాదీకా అమృతమహోత్సవ్ పేరుతో 75 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలకు సిద్ధమవుతున్న దశలో జరుగుతున్న పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఉపాచట్టం రద్దు చేయాలన్న డిమాండు మరోసారి తెరపైకి వచ్చింది. దీనికి సంబంధించి సీపీఐ రాజ్యసభ సభ్యులు సంతోశ్ కుమార్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అడిగిన ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలిచ్చారు. ఉపా చట్టాన్ని రద్దు చేయాలని ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించగా..ఈ చట్టాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ మొదటి నుంచి వ్యతిరేకిస్తోందని సంతోశ్‌కుమార్ చెప్పారు. చట్టరూపం దాల్చిన నాటి నుంచి నేడు అమలవుతున్న తీరు వరకూ చట్టాన్ని తమ పార్టీ తీవ్రంగా తప్పుపడుతోందని, ఒక్క సీపీఐ మాత్రమే కాకుండా దేశంలోని అన్ని వామపక్ష రాజకీయ పార్టీలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని స్పష్టంచేశారు. ఉపా చట్టంలో సమస్యాత్మక అంశాలేమిటని అడుగగా...చట్టంలోని సెక్షన్ 43(డీ) ప్రకారం ఒక వ్యక్తిని 180 రోజుల పాటు ఎటువంటి విచారణ లేకుండానే జైలులో పెట్టడానికి అవకాశం ఉందని, రాజద్రోహం, దేశద్రోహం కేసు నమోదు చేసిన అనంతరం చార్జిషీట్ దాఖలు చేయకుండా ఆ వ్యక్తిని ఆరు నెలల పాటు జైలులో ఉంచేలా నిబంధనలున్నాయని వివరించారు. పైగా ఉపా చట్టం కింద నమోదవుతున్న కేసులు చాలా వరకు నిరూపితమయ్యేవి కావని స్పష్టమవుతోందన్నారు. నిరూపించాల్సిన ఏజెన్సీలు ఏళ్ల తరబడి ఆ పని చేయడం లేదని, కేసులు విచారణకు కూడా రావడం లేదని, కేసులు నమోదైన వారు జైళ్లలోనే ఉండాల్సి వస్తోందని సంతోశ్ కుమార్ తెలిపారు. తీవ్రవాదానికి మీరు ఇచ్చే నిర్వచనం ఏమిటని ప్రశ్నించగా ఉపా చట్టంలో ఉగ్రవాదం అనే అంశానికి ప్రభుత్వం స్పష్టమైన నిర్వచనం పేర్కొన లేదన్నారు. చట్టంలో ఉన్న విషయం చాలా అస్పష్టంగానే ఉందని, ఈ చట్ట ప్రకారం 2008 ముంబైలో తాజ్‌హోటల్‌పై జరిపిన దాడి ఉగ్రవాదమేనన్నారు. ప్రస్తుతం కొన్ని నిర్దిష్టమైన పుస్తకాలను, మావోయిస్టుల కరపత్రాలను చదవడం, కలిగి ఉండడం కూడా ఉగ్రవాదంగా పరిగణించబడుతోందన్నారు. ఇది అత్యంత సున్నితమైన అంశమని, ఇటీవల ఎన్ఐఏ ఉపా చట్టం కింద దాఖలు చేసిన కేసులో విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఆ కేసు పూర్వాపరాలను పరిశీలించి ఇలా అయితే నేటి సమాజంలో వార్తా పత్రికలు చదివే ప్రతివ్యక్తికి ఇది సమస్యగా మారుతుందని వ్యాఖ్యానించి ఆ కేసును కొట్టి వేసిన విషయాన్ని గుర్తించాలన్నారు. ఉగ్రవాద నిరోధానికి ఎలాంటి చట్టం అవసరమని భావిస్తున్నారని కోరగా ఈ విషయంలో పౌర సమాజం, రాజకీయ పార్టీలు, ప్రభుత్వం సమష్టిగా చర్చలు జరపాలని చెప్పారు. ఉగ్రవాదానికి సంబంధించి ఇప్పటికే ఉన్న చట్టాలపై మరోసారి పునరాలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపా చట్టం కింద నమోదైన కేసులు సాధారణ ఐపీసీ చట్టాల కిందకే వస్తాయి. వాటిని సులువుగా పరిష్కరించే అవకాశం ఉంది.
ఇటువంటి అంశాలపై విచారణకు చాలా రాష్ట్రాలకు వారి సొంత చట్టాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు నమోదవుతున్న కేసుల్లో 18-30, 30-40 ఏళ్లలోపు వారిపై ఉపా చట్టం కింద అత్యధికంగా కేసులు నమోదవుతున్నాయి. ఈ చట్టానికి సంబంధించిన కేసుల్లో శిక్షలు పడుతున్న ఘటనలు చాలా తక్కువ. నేరారోపణలతోనే ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గాల్సి వస్తోంది. ఈ చట్టం కింద కేసులు ఎదుర్కొంటున్న వారి జీవితాలు, వారి కుటుంబాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. అందువల్ల ఈ చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐగా డిమాండు చేస్తున్నామని సంతోశ్‌కుమార్ తేల్చిచెప్పారు.

నేటి నుంచి 'అగ్నిపథ్'పై దేశవ్యాప్త ప్రచారం

సంయుక్త కిసాన్ మోర్చా నిర్ణయం

న్యూఢిల్లీ: సైనిక దళాల్లో నియామకాల కోసం కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన 'అగ్నిపథ్' పథకానికి వ్యతిరేకంగా ఆదివారం నుంచి దేశవ్యాప్త ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు 40కి పైగా రైతు సంఘాల గొడుగు సంస్థ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) శనివారం ప్రకటించింది. మాజీ సైనికోద్యోగుల సమైక్య ఫ్రంట్, వేర్వేరు యువజన సంఘాల సహకారంతో ఈ ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు వివరించింది. స్వరాజ్ ఇండియా అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్ శనివారం మాట్లాడుతూ ఈ ప్రచారంలో మొదటి అడుగుగా ఆగస్టు 7 నుంచి ఆగస్టు 14 వరకు ఒక 'జై జవాన్ జై కిసాన్' సదస్సు ఉంటుందని తెలిపారు. 'వివాదాస్పద అగ్నిపథ్ వినాశకర పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, అలాగే ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, శాంతియుత మార్గాలను ఉపయోగించడం ద్వారా కేంద్రం పై వత్తిడి తీసుకువచ్చి ఈ పథకాన్ని ఉపసంహరించుకునేలా చేయడమే లక్ష్యంగా ఈ ప్రచారం ఉంటుంది' అని ఆయన వివరించారు. 'మూడు వ్యవసాయ చట్టాలు దారుణంగా ఉంటే, అగ్నిపథ్ పథకం వినాశకరమైనది. మన రైతులు, సైనికులు కష్టాల్లో ఉన్నందున, మన దేశం వెన్నెముక విరిగిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం బుల్‌డోజ్ చేసి జాతి రక్షకులను, పోషకులను నాశనం చేయడానికి మన మౌనం కారణం కాదు. మేము వారిని ఒకసారి ఆపాము. మేము వాటిని మళ్లీ ఆపగలము' అని యాదవ్ ఇక్కడ విలేకరుల సమావేశంలో అన్నారు. హరియాణాలోని జింద్ జిల్లా, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మథుర, అలాగే కోల్‌కతాలో ఆదివారం కొన్ని ప్రధాన కార్యక్రమాలు జరుగుతాయని ఆయన చెప్పారు. ఆగస్టు 9న రేవారీ (హరియాణా), ముజఫర్‌నగర్ (ఉత్తరప్రదేశ్)లో కార్యక్రమాలు జరుగుతాయి. ఆగస్టు 10న ఇండోర్ (మధ్యప్రదేశ్), మీరట్ (ఉత్తరప్రదేశ్)లో, ఆగస్టు 11న పాట్నాలో కార్యక్రమాలు ఉంటాయి. అగ్నిపథ్ పథకాన్ని ఉపసంహరించుకోవాలని, మునుపటి సాధారణ, శాశ్వత నియామక విధానాన్ని పునరుద్ధరించాలని యాదవ్ అన్నారు. 'అగ్నిపథ్' అనే సైనిక, నావిక, వైమానిక దళాల్లో సైనికుల నియామకం కోసం ఒక పథకం. ఇది చాలా వరకు నాలుగు సంవత్సరాల కాంట్రాక్టు ప్రాతిపదికన ఉంది.

బీఎస్‌పీ ఎంపీని నిర్దోషిగా ప్రకటించిన కోర్టు

వారణాసి: అత్యాచారం, మోసం, బెదిరింపుల కేసులో బహుజన్ సమాజ్ పార్టీ ఎంపీ అతుల్ కుమార్ సింగ్‌ను స్థానిక కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. గత ఏడాది ఆగస్టులో 24 ఏళ్ల మహిళ తన స్నేహితుడితో కలిసి బీఎస్‌పీ ఎంపీపై కేసు నమోదు చేసింది. అయితే ఈ కేసులో సాక్షి (బాధితుడి స్నేహితుడు) గత ఏడాది సుప్రీంకోర్టు వెలుపల ఆత్మాహుతి చేసుకోవడంతో కాలిన గాయాలతో కన్నుమూశాడు. ఘోసీ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అతుల్ రాయ్ ఈ కేసులో 2019 జూన్ నుంచి జైలులో ఉన్నారు. ఆయనకు అనుకూలంగా ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి సియారాం చౌరాసియా తీర్పు వెలువరించినట్టు ఆయన తరపు న్యాయవాది అనూజ్ యాదవ్ తెలిపారు. అతుల్ రాయ్‌పై ఇతర కేసులు పెండింగ్‌లో ఉన్నందున ఆయన వెంటనే జైలు నుంచి విడుదల కాలేదు. బాధితురాలి తరపున ఎలాంటి సాక్ష్యాలు కోర్టుకు సమర్పించలేదని, దీంతో నిందితుడిపై కేసు నిరూపణ కాలేదని జస్టిస్ చౌరాసియా తన తీర్పులో పేర్కొన్నారు. 2019 మే 1న అతుల్ రాయ్, తదితరులపై అత్యాచారం కేసు నమోదైంది. వారణాసిలోని ఫ్లాట్‌కు తనను అతుల్ రాయ్ తీసుకువెళ్లి అత్యాచారం చేశాడని, వీడియోలు, ఫొటోలు తీసి, ఆన్‌లైన్‌లో పెడతానంటూ బెదిరించాడని పోలీసు ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది. దీంతో 2019 జూన్ 22న రాయ్ కోర్టుకు లొంగిపోయారు. అప్పటి నుంచి ఆయన ప్రయాగరాజ్‌లోని నైని జైలులో ఉంటున్నారు.

బీజేపీ, జేడీయూ ఆధిపత్య పోరు

- బీహార్‌లో నంబర్ వన్ కోసం నితీశ్ పార్టీ యత్నం
- మిత్రపక్ష బీజేపీ వ్యాఖ్యలపై ఆగ్రహం
- ఎన్డీయే నాయకుడు నితీశ్: బీజేపీ

పాట్నా: బీహార్‌లో తామే నంబర్ వన్ పార్టీ కావాలని జేడీ(యూ) పట్టుదలగా ఉంది. రాష్ట్రంలో రాజకీయ శక్తిగా ఎదుగుతామని బీజేపీ అధినేతలు ఇటీవల చేసిన వ్యాఖ్యలు నితీశ్ కుమార్ పార్టీకి కోపం తెప్పించాయి. దీంతో రాజకీయ బంధాన్ని తెంచుకోవాలా వద్దా అన్న సందేహంలో పడింది. మరోవైపు బీజేపీ వైఖరి కాస్త భిన్నంగా ఉంది. ఒకవైపు రాష్ట్రంలో రాజకీయ శక్తిగా అతిపెద్ద పార్టీగా ఉంటామని చెబుతూనే మరోవైపు జేడీ(యూ) తెగతెంపులు చేసుకునేది లేదని అంటోంది. తమ అనుబంధం దశాబ్దాల నుంచి ఉందని, నితీశ్ కుమార్ రాష్ట్రంలో ఎన్డీయే నాయకుడని చెప్పుకుంటోంది. తాజా పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారాయి.

బీహార్‌లో అతిపెద్ద పార్టీగా, రాజకీయ శక్తిగా నిలవడమే తమ లక్ష్యమని బీజేపీ అధిష్ఠానం తేల్చిచెప్పింది. దీంతో మిత్రపక్షాలు తెగతెంపులు చేసుకునే సంకేతాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఏకైక పెద్దపార్టీగా తమ హోదాను తిరిగి పొందేందుకు జేడీ(యూ) గట్టి కసరత్తు చేస్తున్నట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లాలన్ ప్రకటించారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో తగిలిన ఎదురుదెబ్బను తట్టుకొని నిలబడేందుకు తమ బలాన్ని పెంచుకుంటున్నట్లు చెప్పారు. 'కుట్ర' కారణంగానే ఓటమి తప్పలేదని, ఇదంతా లోక్ జనశక్తి పార్టీ అధినేత చిరాగ్ పాశ్వాస్ నిర్వాకమని వ్యాఖ్యానించారు. అనేకమంది బీజేపీ తిరుగుబాటు నేతలను జేడీ(యూ) అభ్యర్థులపై పోటీ చేయించారని, ఫలితంగా 71 స్థానాల నుంచి 43కు నితీశ్ పార్టీ పరిమితం కావాల్సి వచ్చిందన్నారు. జేడీ(యూ)కు బుజ్జగింపులు, కాషాయ పార్టీ పెత్తందారీతనంపై లాలన్ మండిపడ్డారు. 'రేపు ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు? పార్టీని నంబర్ వన్‌గా చేస్తాం. 2024, 2025 చాలా దూరంగా ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన కుట్ర కారణంగా కోల్పోయిన స్థానాల్లో బలాన్ని పుంజుకోవాల్సి ఉంది' అని ఆయన అన్నారు. జేడీ(యూ) స్పష్టమైన వైఖరితోనే ఉందని, బీజేపీ అనవసర ప్రకటనలతో రెచ్చగొడుతోందని జేడీ(యూ) ప్రధాన అధికార ప్రతినిధి నీరజ్ కుమార్ అన్నారు. 'ఇది 2022. 2024-2025 గురించి ఇప్పుడు మాట్లాడటం వల్ల ప్రయోజనం లేదు. ఎన్డీయేలో నితీశ్ కుమార్ నాయకత్వంపై ఎన్నడూ ప్రశ్నలు రాలేదు. అనవసరపు ప్రకటనలు చేయాల్సిన అవసరం బీజేపీకి ఏమిటి? అని ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ చేసిన ప్రకటననుద్దేశించి నీరజ్ అన్నారు.

జేడీ(యూ) నేతల వ్యాఖ్యలపై ఆర్జేడీ అధికార ప్రతినిధి మృత్యుంజయ్ తివారీ స్పందిస్తూ 'ఎన్డీయేకు తిప్పలు తప్పేట్టు లేవు. వర్షాకాలంలో వచ్చే వరదలకు దాని నావ మునిగిపోయేట్లు ఉంది' అని ఎద్దేవా చేశారు. నితీశ్ కుమార్‌ది సమాజ్‌వాదీ (సోషలిస్టు) నేపథ్యమని, ఆయన భావజాలానికి బీజేపీ హిందూత్వ అజెండాకు పొలిక కుదరదని, ఆయన దీనిని సహించబోరని తివారీ అభిప్రాయపడ్డారు. జేడీయూకి, ఆర్జేడీకి మధ్య పొత్తు గురించి ఇప్పట్లో ఏమీ చెప్పలేనన్నారు. రాష్ట్రంలో సమాజ్‌వాదీ ప్రభుత్వం త్వరలోనే ఏర్పాటు అవుతుదని, తేజస్వీయాదవ్ ద్వారా ప్రజల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయని అన్నారు. 'సమాజ్‌వాదీ' ప్రభుత్వం ఎలా ఉంటుందన్నది ఇప్పుడే చెప్పడం తొందరపాటు అవుతుందన్నారు. పాత మిత్రపక్షంతో మాటలయుద్ధం కొనసాగించే ఉద్దేశంలో బీజేపీ లేనట్లు ఉంది. నితీశ్‌తో 1996 నుంచి సత్సంబంధాలు ఉన్నాయి. అప్పట్లో ఆయనది సమతా పార్టీ. ఈ పార్టీ వారు ఏమి చెప్పినా పట్టించుకోం' అని బీజేపీ ప్రతినిధి ప్రేమ్ రంజన్ పటేల్ అన్నారు. 'బీహార్‌లో ఎన్డీయే నేతగానే నితీశ్ కుమార్‌ను బీజేపీ భావిస్తూ వచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి తల్లడిల్లిపోయారు. గద్దె దిగిపోతానని చెప్పారు. మా నాయకుడిగా ఆయన ఉంటారని బీహార్ ప్రజలకు హామీ ఇచ్చిన కారణంగా ఆ పదవిలో కొనసాగాలని నచ్చజెప్పాం. ఏ పార్టీ ఎన్ని సీట్లు గెలిచిందన్నది ముఖ్యం కాదు' అని పటేల్ అన్నారు. తమ జాతీయ నేత మోదీ అని, బీహార్‌లో నితీశ్ అని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో నితీశ్ పార్టీతో పొత్తు ఉంటుందని, అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన నాయకత్వంలో పోటీ చేస్తామని పటేల్ తెలిపారు.

మోదీ సమావేశానికి నితీశ్ డుమ్మా

బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఈ మధ్యనే కోవిడ్ నుంచి కోలుకున్నారు. ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ సమావేశానికి ఉప ముఖ్యమంత్రిని పంపాలని భావించారు. కానీ సీఎంలు మాత్రమే రావాలని చెప్పడంతో నితీశ్ డుమ్మా కొట్టారు. మోదీ సమావేశాలకు నితీశ్ గైర్హాజరు కావడం నెలలో ఇది రెండవసారి. ఢిల్లీలో మోదీ అధ్యక్షతన నీతిఆయోగ్ సమావేశానికి బీహార్ నుంచి ప్రాతినిధ్యం లేదని అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్ర అభివృద్ధి ర్యాంకింగుల్లో బీహార్‌ను చిట్టచివర ఉంచే కారణంగా నీతిఆయోగ్ అంటే నితీశ్‌కుమార్‌కు గిట్టదని పేర్కొన్నాయి. గతనెలలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కొత్త రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సన్మానార్థం మోదీ ఇచ్చిన విందుకూ నితీశ్ వెళ్లలేదు. అమిత్‌షా నిర్వహించిన ముఖ్యమంత్రుల సమావేశానికి తనకు బదులు ఉపముఖ్యమంత్రిని పంపారు. బీజేపీతో అభిప్రాయభేదాలే ఇందుకు కారణమని తెలుస్తోంది. అయితే తన ఆరోగ్యం, ఇతర కారణాల వల్ల కొద్దివారాలుగా రద్దు అయిన కార్యక్రమాలను నితీశ్ తిరిగి చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయన సోమవారం జనతా దర్బార్ నిర్వహిస్తారన్నారు.

వర్షారౌత్‌ను ప్రశ్నించిన ఈడీ

ముంబై: పత్రాచావల్ పునరాభివృద్ధి అవకతవకలకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో శివసేన ఎంపీ సంజయ్ రౌత్ భార్య వర్షా రౌత్ శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముందు హాజరయ్యారు. ఈ కేసులో ఇప్పటికే సంజయ్ రౌత్‌ను ఈడీ అరెస్టు చేసింది. కస్టోడియల్ ఇంటరాగేషన్‌లో ఆయన నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా వర్షను ఈడీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. కాగా, సంజయ్ రౌత్ కస్టడీని ఈనెల 8 వరకూ పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టు పొడిగించింది. పత్రాచావల్ పునరాభివృద్ధి వ్యవహారంలో రౌత్ దంపతులకు రూ.3.3 కోట్లు ముట్టినట్టు ఈడీ ఆరోపిస్తోంది. ఇందులో ఎక్కువ మొత్తం వర్షా రౌత్ అకౌంట్లకు జమ అయ్యాయని చెబుతోంది. వర్షా రౌత్ బ్యాంక్ అకౌంట్లను పరిశీలించి ఈ నిర్ధారణకు వచ్చామని ఈడీ తెలిపింది. తన భార్యకు ఇంత పెద్దమొత్తంలో సొమ్ము ఎలా అందిందనే విషయంలో ఈడీ అధికారులు సంజయ్ రౌత్‌ను తరచి తరచి ప్రశ్నించినప్పటికీ ఆయన నుంచి సరైన సమాధానం రాలేదని ఈడీ చెబుతోంది.

మాట్లాడుతున్న రామకృష్ణ. వేదికపై జేవీఎస్ఎన్ మూర్తి, జగదీశ్, వేమయ్య, సురేంద్రచౌదరి, ఈశ్వరయ్య తదితరులు

ప్రజా ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు, సీపీఐ శ్రేణులు

రాష్ట్రంలో పాలన ఉందా?

- పోలవరానికి ఒక్క రూపాయి ఖర్చు పెట్టావా?
- జగన్‌పై ప్రజల్లో నమ్మకం పోయింది
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: రాష్ట్రంలో పాలన ఉందా? పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఒక్క రూపాయి ఖర్చు పెట్టావా? పోలవరం ముంపు ప్రజలు తెలంగాణకు వెళితే బాగుంటుందని అనుకుంటున్నారంటే నీ పరిపాలన ఎలా ఉందో తెలుసుకో, విద్యుత్ సౌకర్యం లేక 21 రోజులు చీకటిలో ప్రజలు ఉన్నారంటే ప్రభుత్వం ఏం చేస్తుంది? జగన్ పై ప్రజల్లో నమ్మకం పోయిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఘాటుగా విమర్శించారు.

సీపీఐ శ్రీ సత్యసాయి జిల్లా ప్రథమ మహాసభ శనివారం పుట్టపర్తిలో జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ అధ్యక్షత వహించగా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సురేంద్ర చౌదరి అతిథులను వేదికపై ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్థానిక గంగమ్మ గుడి వద్ద నిర్వహించిన బహిరంగ సభలో రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర కార్యవర్గదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీశ్ పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ పోలవరంపై అసెంబ్లీలో మీరేం చెప్పారు... ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి కనీసం ఒక ఇంచు పనైనా చేపట్టారా... మూడేళ్ల కాలంలో ఒక్కటయినా మంచి పని చేశామని చెప్పగలరా? అని ప్రశ్నించారు. గతంలో రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర రూ.1,150కి, నూనె ప్యాకెట్ రూ.60 నుంచి 200 దాటిందని అన్నారు. సామాన్య ప్రజలు ఈ నూనె కొనుగోలు చేసి తినగలరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలపై, నిత్యావసర సరుకుల ధరలపై ప్రశ్నిస్తామన్నారు. ఇంత అధ్వాన పరిపాలన దేశంలో ఎక్కడా లేదంటూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించారు. నిత్యం కరువుకాటకాలకు నిలయంగా ఉన్న సత్యసాయి జిల్లాలో ఇప్పుడు భారీ వర్షం పడినా తడుస్తూ కమ్యూనిస్టులకు అండగా మీరంతా నిలబడడం శుభపరిణామమని ప్రజలను ఉద్దేశించి రామకృష్ణ అన్నారు. వర్షాలు, వరదలకు నష్టపోయిన బాధితులకు తెలంగాణలో కుటుంబానికి రూ.10 వేలు ఇస్తే, మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మీకు రూ.2,000 అందిందా? అని పరామర్శించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అంటే చులకన భావం కలిగే విధంగా హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ చేసిన వ్యవహారంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంటే, సీఎం జగన్ మాత్రం నోరు మెదపకుండా మౌనంగా ఉండటం ఎటువైపు దారి తీస్తుందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ప్యాలెస్‌లో కూర్చొని ఉన్నారని, ఎమ్మెల్యేలు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నిమగ్నమవగా, ఎంపీలు వాళ్ల పనులు వాళ్లు చేసుకుంటున్నారని, ఇదేనా పరిపాలన అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మహాసభలు జరుపుకోవడం రాజకీయ పార్టీలకు ఆనవాయితీ అని, ఇటీవల గుంటూరులో వైసీపీ పెద్ద ఎత్తున మహాసభ జరుపుకుందని అన్నారు. అయితే ఆ సభలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు 40 టన్నుల చొప్పున రొయ్యలు, చేపలు తిన్నారేగానీ రాష్ట్ర ప్రయోజనాల గురించి ఒక్క మాటైనా మాట్లాడలేదని అన్నారు. పుష్టిగా తిన్న ఎమ్మెల్యేలు, మంత్రులు సీఎం జగన్‌ను వీరుడు... సూర్యుడంటూ పొగడటమే సరిపోయిందన్నారు. ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలపై చర్చించలేదని తెలిపారు. ఈ సభలో సీపీఐ అనంతపురం జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయక కార్యదర్శులు పి.నారాయణస్వామి, మల్లికార్జున, రాజారెడ్డి, కాటమయ్య, శ్రీరాములు, కేశవరెడ్డి, మహిళా నాయకురాలు పద్మావతి, అమినాబి, రాజేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఢిల్లీలో కాంగ్రెస్ ఆందోళనపై కేసు

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, నిత్యావసర ధరల పెరుగుదల, జీఎస్‌టీ భారం తదితర ప్రజాసమస్యలపై శుక్రవారం ఢిల్లీలో ఆందోళన చేపట్టిన కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలపై కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన దేశ వ్యాప్త ఆందోళనల్లో భాగంగా ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగిన విషయం తెలసిందే. ఈ నిరసనలకు సంబంధించి ఆ పార్టీ నేతపై ఢిల్లీలోని తుగ్లక్ రోడ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు నగర డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అమృత గుగులోత్ తెలిపారు. నిరసన కారులపై ఐపీసీ 186, 188, 332, 34 తదితర సెక్షన్‌ల కింద కేసునమోదు చేసినట్టు తెలిపారు. రాజధానిలో శుక్రవారం నిషేధాజ్ఞలు అమల య్యాయని, ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు ఆందోళన చేపట్టిన క్రమంలోనే ఆవదోళరకారులపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం నాటి ఆందోళనల్లో 65 మంది ఎంపీలతో సహా 300 మందికి పైగా నిరసనకారులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

ఉత్కంఠ పోరులో టీమిండియా గెలుపు

- దుమ్మురేపిన స్మృతి మంధాన
- ఆదుకున్న జమీమా రోడ్రిగ్స్

బర్మింగ్‌హామ్: కామన్వెల్త్ గేమ్స్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించిన టీమిండియా అమ్మాయిలు ఫైనల్స్‌లో అడుగుపెట్టి పతకం ఖాయం చేశారు. తొలుత బ్యాటింగ్‌లో ఇరగదీసిన హర్మన్‌ప్రీత్ సేన ఆ తర్వాత బౌలింగులోనూ ప్రతాపం చూపి ఇంగ్లండ్‌ను మట్టికరిపించింది. తొలుత స్మృతి మంధాన దూకుడుతో 164 పరుగుల భారీ స్కోరు సాధించిన భారత్.. ఆ తర్వాత ఇంగ్లండ్‌ను 160 పరుగులకే కట్టడి చేసి ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో విజయం పలుమార్లు చేతులు మారినప్పటికీ చివరికి టీమిండియాదే పై చేయి అయింది. వరుస రనౌట్లు ఇంగ్లండ్ కొంప ముంచాయి. భారత్ నిర్దేశించిన 165 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లండ్‌కు ఆరంభం కలిసిరాలేదు. 28 పరుగుల వద్ద ఓపెనర్ సోఫియా డంక్లీ (19) అవుటైంది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన అలీస్ కేప్సీతో కలిసి డేనియల్ వైట్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యతను భుజానికెత్తుకుంది. అయితే, 13 పరుగులు మాత్రమే చేసిన అలీస్ రనౌట్‌గా వెనుదిరగడంతో తిరిగి కష్టాల్లో కూరుకుపోయినట్టు కనిపించింది. కెప్టెన్ నటాలియా స్కివర్ రాకతో మళ్లీ బలం పుంజుకున్న ఇంగ్లండ్ విజయం వైపుగా దూసుకెళుతున్నట్టు కనిపించింది. ఈ క్రమంలో క్రీజులో పాతుకుపోయిన డేనియల్ వైట్ (35)ను స్నేహ్ రాణా బౌల్డ్ చేయడంతో 81 పరుగుల వద్ద మూడో వికెట్ కోల్పోయింది. నాటాలీ స్కివర్ (41), అమీ జోన్స్ (31) కలిసి భారత శిబిరాన్ని కాసేపు ఆందోళనలోకి నెట్టేశారు. ఈ క్రమంలో మరింత పొదుపుగా బౌలింగ్ చేసిన బౌలర్లు వారిని ఒత్తిడిలోకి నెట్టే ప్రయత్నం చేశారు. దీంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. వీరిద్దరూ రనౌట్ అయ్యాక కూడా మ్యాచ్ ఫలితంపై ఉత్కంఠ వీడలేదు. చివరి ఓవర్‌కు ఇంగ్లండ్ విజయానికి 14 పరుగులు అవసరం కాగా, తొలి బంతికి పరుగు రాలేదు. రెండో బంతికి సింగిల్ వచ్చింది. మూడో బంతికి బ్రంట్ అవుట్ కావడంతో మ్యాచ్ భారత చేతుల్లోకి వచ్చినట్టే కనిపించింది. నాలుగో బంతికి ఒక్క పరుగు వచ్చింది. ఇక చివరి రెండు బంతులకు 12 పరుగులు అవసరం కాగా, ఒక్క పరుగు మాత్రమే లభించింది. దీంతో భారత్ విజయం ఖాయమైపోయింది. అయితే, చివరి బంతిని ఎక్లెస్టోన్ సిక్సర్‌గా మలచడంతో భారత్ నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించింది. కేరింతలతో స్టేడియం హోరెత్తిపోయింది. అమ్మాయిలు ఆనందంతో పరుగులు తీశారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన 23 బంతుల్లోనే 8 ఫోర్లు, 2 సిక్సర్లతో అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. క్రీజులో పాతుకుపోయిన మంధాన, షెఫాలీ వర్మ జోడీని విడగొట్టేందుకు మార్చి మార్చి బౌలర్లను ప్రయోగించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చివరికి 76 పరుగుల వద్ద షెఫాలీ వర్మ (15) అవుటైంది. ఫ్రెయా కెంప్ బౌలింగ్‌లో బ్రంట్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరింది. మంధాన దూకుడుగా ఆడుతుంటే ఆమెకు అండగా నిలిచిన షెఫాలీ అవుటైన తర్వాత మరొక్క పరుగు జోడించాక స్మృతి మంధాన కూడా అవుటైంది. మొత్తంగా 32 బంతులు ఎదుర్కొన్న మంధాన 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 61 పరుగులు చేసింది. మంధాన వేసిన పునాది కూలిపోకుండా జెమీమా రోడ్రిగ్స్ కాపాడింది. 31 బంతులు ఆడిన జెమీమా 7 ఫోర్లతో 44 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. హర్మన్‌ప్రీత్ కౌర్ 20, దీప్తి శర్మ 22 పరుగులు చేయడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 164 పరుగుల భారీ స్కోరు చేయగలిగింది.

అథ్లెట్లు... అదరహో

బర్మింగ్‌హామ్: కామన్వెల్త్ క్రీడల్లో భారత్ ఖాతాలో మరో రెండు పతకాలు చేరాయి. ఎనిమిదో రోజు ముగిసే సరికి 9 స్వర్ణాలు, 8 రజతాలు, 9 కాంస్యలతో మొత్తం 26 పతకాలు సాధించి భారత్ ఐదో ప్లేస్‌లోఉంది. తాజాగా మహిళల 10 వేల మీటర్ల రేస్ వాక్‌లో భారత క్రీడాకారిణి ప్రియాంక గోస్వామి అద్భుత ప్రదర్శన చేసి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ప్రియాంక 43:38.82లో రేసును పూర్తి చేసింది. పురుషుల 300మీటర్ల స్టీపుల్‌చేజ్ ఫైనల్‌లో అవినాష్ సాబ్లే రజతం సాధించాడు. 8:11.20లో రేసు పూర్తిచేసి భారత్ తరపున అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. దీంతో భారత్ పతకాల సంఖ్య 28కు చేరింది. మరోవైపు భారత బాక్సర్లు అమిత్ పంఘల్ (పురుషుల ఫ్లై వెయిట్), నీతూ ఘంగాస్ (మహిళల విభాగం) ఫైనల్ చేరారు. రెజ్లింగ్‌లో మహిళల 76 కేజీల క్వార్టర్ ఫైనల్‌లో పూజా సిహాగ్ న్యూజిలాండ్ ప్లేయర్ మిచెల్ మాంటేగ్‌ను ఓడించి సెమీఫైనల్‌లోకి ప్రవేశించింది. పురుషుల 74 కేజీల క్వార్టర్ ఫైనల్లో నవీన్ సింగపూర్‌కు చెందిన హాంగ్ యోవ్ లూను ఓడించి సెమీ ఫైనల్‌లోకి ప్రవేశించాడు.

వయసు 75... ప్రపంచ రికార్డ్ బద్దలు

కామన్వెల్త్ క్రీడల్లో ఎనిమిదో రోజు సరికొత్త రికార్డు నమోదైంది. స్కాట్లాండ్‌కు చెందిన జార్జ్ మిల్లర్ 'లాన్ బౌల్స్' మిక్స్‌డ్ పెయిర్‌లో బంగారు పతకం సాధించి, 75 ఏళ్ల వయసులో రికార్డు సృష్టించాడు. 'లాన్ బౌల్స్' మిక్స్‌డ్ పెయిర్ ఫైనల్‌లో మెలనీ ఇన్నెస్‌తో కలిసి విజేతగా నిలిచాడు. దీంతో కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో పసిడి పతకం నెగ్గిన అతిపెద్ద వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. మెలానీ ఇన్నెస్, జార్జ్ మిల్లర్, రాబర్ట్ బార్, సారా జేన్ ఎవింగ్ (పారా మిక్స్‌డ్ పెయిర్స్ బీ2/బీ3) జట్టు 16-9 తేడాతో వేల్స్‌ను ఓడించి గోల్డ్ మెడల్ కొట్టింది. ఈ ఈవెంట్‌లో స్కాట్లాండ్ జట్టు గెలుపొందడం కూడా ఇదే తొలిసారి. అయితే, ఈ కామన్వెల్త్ క్రీడల్లోనే బుధవారం స్కాట్లాండ్‌కు చెందిన 72 ఏళ్ల రోజ్మేరీ లెంటన్ పారా లాన్ బౌల్స్ మహిళల విభాగంలో పసిడి నెగ్గి.. కామన్వెల్త్ చరిత్రలో గోల్డ్ మెడల్ గెలిచిన అతిపెద్ద వయసు గల వ్యక్తిగా రికార్డు సృష్టించింది. అయితే, ఇప్పుడు అదే దేశానికి చెందిన జార్జ్ మిల్లర్ ఆమె రికార్డు బద్దలు కొట్టడం విశేషం.

ఉమెన్ హాకీ సెమీస్‌లో ఘోర తప్పిదం

- ఆగ్రహం వ్యక్తం చేసిన క్రికెటర్ సెహ్వాగ్, నెటిజన్లు
- తప్పైపోయింది..మమ్మల్ని క్షమించండి: అంతర్జాతీయ హాకీ సమాఖ్య

బర్మింగ్‌హామ్: కామన్వెల్త్ క్రీడల్లో భాగంగా ఉమెన్ హాకీ సెమీఫైనల్‌లో అంపైర్ చేసిన తప్పిదం వివాదానికి దారితీసింది. శుక్రవారం ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరిగిన పోరులో మ్యాచ్ ముగిసే సమయానికి రెండు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. దీంతో పెనాల్టీ షూటౌట్ నిర్వహించారు. అయితే, ఇక్కడ అంపైర్ చేసిన తప్పిదం వల్ల భారత్ ఓటమి పాలైంది. దీనిపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేయగా, అంతర్జాతీయ హాకీ సమాఖ్య సైతం స్పందించి క్షమించమని కోరింది.

అసలేం ఏం జరిగింది..!

పెనాల్టీ షూటౌట్‌లో భాగంగా ఆస్ట్రేలియా డిఫెండర్ రోసీ మలోనే షూటౌట్‌కు సిద్ధమైంది. తొలి ప్రయత్నంలో ఆమె షాట్ ఆడగా.. భారత గోల్‌కీపర్ సవితా ఆస్ట్రేలియాకు గోల్ దక్కకుండా ఆపింది. దీంతో ఆసీస్ ఒక పెనాల్టీ వృథా అయిందని అంతా భావించారు. అయితే, ఈ లోగా అంపైర్ వచ్చి ఆమెను మళ్లీ షూటౌట్ చేయమని కోరింది. ఇదేంటని భారత ఆటగాళ్లు అడిగితే, షూటౌట్ క్లాక్ టైంలో తప్పిదం ఉందని.. అందుకే మళ్లీ ప్రారంభించాలని చెప్పింది. వచ్చిందే అవకాశం అన్నట్లు మలోనే రెండోసారి గురి తప్పలేదు. దీంతో ఆస్ట్రేలియాకు ఆత్మవిశ్వాసం పెరగ్గా, భారత్ నిరాశ చెందింది. ఆ తరవాత ఆసీస్ వరుసగా మూడు గోల్స్ కొట్టింది. భారత్ మాత్రం ఒక్క గోల్ చేయలేకపోయింది. దీంతో పెనాల్టీ షూటౌట్‌లో ఆసీస్ చేతిలో భారత్ 3-0 తేడాతో ఓటమిపాలైంది.

సెహ్వాగ్ ఆగ్రహం

ఈ మ్యాచ్‌లో అంపైర్ల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదీ గల్లీ మ్యాచ్ కాదని, ఎంతో మంది వీక్షించే పెద్ద ఈవెంట్ అని మర్చిపోయి, క్లాక్‌టైం మిస్టేక్ అని చెప్పడం ఏంటని నెటిజన్లు సోషల్‌మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. అంపైర్ల పద్ధతిపై ప్రముఖ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ ట్విటర్ వేదికగా ఘాటైన ట్వీట్ చేశాడు. 'ఆసీస్ పెనాల్టీ మిస్ చేయగానే అంపైర్ పరిగెత్తుకొచ్చి.. సారీ క్లాక్ ఇంకా స్టార్ట్ చేయలేదు.. మళ్లీ ఆరంభిద్దామా అని సింపుల్‌గా చెప్పేసింది. అంపైర్లు ఎందుకు ఇలా చేస్తారో తెలియడం లేదు. క్రికెట్.. హాకీ ఇలా ఏ క్రీడైన అంపైర్లు తమకుండే సూపర్ పవర్‌తో ఎలాంటి నిర్ణయమైనా తీసుకుంటారు. అయితే, అమ్మాయిలు మిమ్మల్ని చూస్తే గర్వంగా ఉంది.' అంటూ క్యాప్షన్ జత చేశాడు.

హాకీ సమాఖ్య క్షమాపణ

మరోవైపు భారత్-ఆస్ట్రేలియా సెమీస్ మ్యాచ్‌పై విమర్శలు ఎక్కువ అవ్వడంతో అంతర్జాతీయ హాకీ సమాఖ్య ట్విట్టర్ వేదికగా క్షమాపణ కోరింది. 'కామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత్-ఆస్ట్రేలియా సెమీఫైనల్లో షూటౌట్ సమయంలో చిన్న తప్పిదం వల్ల క్లాక్ సెట్ చేయకముందే షూటౌట్ ప్రారంభమైంది. ఈ తప్పిదం జరిగినందుకు మేం క్షమించమని కోరుతున్నాం. ఇలాంటివి భవిష్యత్‌లో జరగకుండా జాగ్రత్తపడతాం.' అని ట్వీట్ చేసింది.

సర్పంచ్...విశాలాంధ్ర పేపర్ బాయ్

పత్రికపై అభిమానంతోనే: పొదిల ప్రసాద్

విశాలాంధ్ర-లింగపాలెం: ప్రజా సమస్యలను నిత్యం వెలుగులోకి తీసుకువస్తున్న విశాలాంధ్ర పత్రికకు ఒక గ్రామ సర్పంచ్ పేపర్ బాయ్‌గా ఉండటంపై హర్షధ్వానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పత్రిక పై ఉన్న అభిమానమే తనను ముందుకు నడిపిస్తోందని ఆయన చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే... ఏలూరు జిల్లా లింగపాలెం మండలంలో మఠంగూడెం పంచాయతీ సర్పంచ్ పొదిల ప్రసాద్ సర్పంచ్‌గా మంచి మెజార్టీతో విజయం సాధించారు. సర్పంచ్ కాకముందు వివిధ పత్రికలకు పేపర్ బాయ్‌గా పని చేశారు. సర్పంచ్ అయిన తర్వాత కేవలం విశాలాంధ్ర పత్రికపై ఉన్న అభిమానంతో రోజూ ఇంటింటికి వెళ్లి పత్రిక వేస్తున్నారు. దీంతోపాటు కొన్ని పత్రికలు వేస్తున్నా విశాలాంధ్ర పత్రికపై ఉన్న అభిమానంతో సర్పంచ్‌గా ఉన్నా ఈ పత్రికకు పేపరు బాయ్‌గా ఉండడం గర్వంగా ఉందని, అందువల్ల ఈ వృత్తిని ఆపడం లేదని అంటున్నారు. సర్పంచ్‌గా హంగూ, ఆర్భాటం లేకుండా ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధిలో తీరిక లేకుండా ఉండే ప్రసాద్ విశాలాంధ్ర పత్రికను ఇంటింటికి వెళ్లి ఇవ్వడంపై ప్రజలు, విశాలాంధ్ర పత్రిక పాఠకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల్ని జయప్రదం చేద్దాం

విశాఖలో ఏఐఎస్ఎఫ్ నేతల ప్రచారం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆగస్టు 26, 27, 28 తేదీల్లో విశాఖ నగరంలోని నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర 27 మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు ఆధ్వర్యంలో నగరంలోని కంచెరపాలెం ఏరియా మార్కెట్టులో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ మహాసభల కరపత్రాలను పంపిణీ చేస్తూ మహాసభల విజయవంతం కోసం తోచిన రీతిలో ఆర్థికంగా సహకరించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ...48 ఏళ్ల అనంతరం విశాఖ నగరంలో పార్టీ మహాసభలు జరుగనున్న తరుణంలో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని పేర్కొన్నారు. పార్టీ మహాసభలకు అడిగిన తక్షణం ప్రజలు స్వచ్ఛందంగా తమకు తోచిన రీతిలో ఆర్థిక సహకారం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి పణీంద్ర, ఉపాధ్యక్షులు బాబ్జీ, సమితి సభ్యులు బాలాజీ, సోమేశ్, నబి, వంశి, సత్యనారాయణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి గుంటూరులో 'ప్రజా కళారూపాల శిక్షణ' శిబిరం

ఇప్టా జాతీయ కార్యదర్శి గని

విశాలాంధ్ర-గుంటూరు: కళ వినోదం కోసం కాదు... ప్రజల కోసమనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతరం ప్రజలను జాగృతం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి 'ప్రజా కళారూపాల శిక్షణ' శిబిరం ఈ నెల 20 నుంచి 24 వరకు గుంటూరులోని మల్లయ్యలింగం భవన్‌లో జరుగనున్నట్లు ఇప్టా జాతీయ కార్యదర్శి గని తెలిపారు. ఈ మేరకు మల్లయ్యలింగం భవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో శిక్షణా శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. తెలుగునాట ప్రజానాట్యమండలి నిర్వహించిన పాత్ర ఎంతో ఘనమైందని గని అన్నారు. కళ కేవలం వినోదం కోసమే కాదని, దానికి ఒక ప్రయోజనం, లక్ష్యం ఉండాలన్నారు. అది పీడిత ప్రజల పక్షపాతి అయి ఉండాలని చాటిచెబుతున్న సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అని అన్నారు. 1943లో ప్రారంభించబడి, ఉద్యమాలకు ఊతమిచ్చిన ప్రేరణ ప్రజానాట్యమండలి అని, ప్రస్తుత కార్పొరేట్ సంస్కృతికి ప్రత్యామ్నాయంగా ప్రజా కళలను తీర్చిదిద్దుకో వాల్సిన తక్షణ కర్తవ్యం మనముందున్నదన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ప్రజా కళారూపాల రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరంలో సామాజిక స్పృహతో కూడుకున్న కళా రూపాలకు శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 మంది పైచిలుకు కళాకారులు ఈ శిబిరానికి హాజరుకానున్నారన్నారు. జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, చెవుల పున్నయ్య, డేవిడ్ పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.